

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

బుధవారం, 21 మే 2025 | 8 పేజీలు

2029ఎన్నికల నాటికి వైసిపి ఉండదు

- ఉక్కు పరిశ్రమ నిర్మాణం పనులు ప్రారంభమవుతాయి
- పదవులు కాదు.. పార్టీ కార్యకర్తలే ముఖ్యం
- యువతకు ఉద్యోగ కల్పనకు మొదటి ప్రాధాన్యత
- అభివృద్ధిలో జమ్మలమడుగును రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుతాం

విశాలాంధ్ర-జమ్మలమడుగు: 2029 ఎన్నికల నాటికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కనుమరుగు అవ్వడం ఖాయంగా కనిపిస్తుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జమ్మలమడుగు పట్టణంలోని ముదునూరు రోడ్డు నానుబాల ఎల్లప్ప ఫంక్షన్ హాల్ నందు జమ్మలమడుగు నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. మొదటగా నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలు మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ కడప జిల్లా జమ్మలమడుగు లో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులు త్వరలో చేపడుతామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి లాగా మూడుసార్లు ఉక్కు పరిశ్రమకు టెంకాయలు కొట్టే ఆనవాయితీని కూటమి సర్కార్ చెయ్యదు అన్నారు. ఉక్కు పరిశ్రమ పనులను పర్యవేక్షించేందుకు తొందరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ నామినేటెడ్ పదవులు కంటే తనకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే ముఖ్యమని పేర్కొన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎన్నో అరాచకాలు, దౌర్జన్యాలను ఎదుర్కొని తనతో పాటు నిలబడిన ప్రతి కార్యకర్త శ్రేయస్సే తనకు ముఖ్యమన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో ఉన్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పనకు తాను మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో పులివెందుల నియోజకవర్గానికి చెందిన వారికే ఉద్యోగ అవకాశాలు లభించాయని,అలాంటిది ఇకపై జరగని యువతకు భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి కేవలం నెలలే అవుతున్నప్పటికీ జమ్మలమడుగును నియోజకవర్గంలో ప్రతి గ్రామం లో రెండు నుండి మూడు లక్షల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. రానున్న నాలుగు సంవత్సరాలలో జమ్మలమడుగు నియోజకవర్గ అభివృద్ధిలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు.

2 లో

ఫారం పాండ్ పనులను పరిశీలించిన పీడీ

2 లో

విశాలాంధ్ర-గాలివీడు: మండలంలోని నూలివీడు గ్రామం చీమల చెరువుపల్లిలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఫారం పాండ్ పనులను

కాడెద్దులు.. కరువాయె..

యంత్రాల సేద్యం బరువాయె..

- నేటి రైతు పరిస్థితి ఇది

విశాలాంధ్ర-లింగాల: నాగరికత ఎంత ముందుకు సాగుతున్నా నాగలిలేనిదే మనుగడలేదు. అటువంటి నాగలి పట్టే రైతన్నకు కాడెద్దులు కరువవుతున్నాయి. యంత్రాల సేద్యం భారమవుతోంది, ఏ పల్లె చూసినా కాడెద్దులు కనిపించడం లేదు. యాంత్రిక జీవనం ఆధారపడిన సగటు మనిషి ఆధునికత వైపు మొగ్గు చూపుతున్నాడు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలల్లో పశు పంసద గననీయంగా తగ్గింది. నిత్యావసరాల ధరల తరహాలోనే సేద్యపుటెద్దుల ధరలు పెరిగాయి. కనీసం రూ.70వేల నుంచి లక్షరూపాయలు వెచ్చిస్తేగానీ ఒక రకమైన కాడెద్దులు దొరకడం కష్టం. ఈ సేద్యపుటెద్దులను పోషించాలంటే రైతుకు తలకు మించిన భారమవుతోంది. గ్రాసం అంతరించిపోయింది. గ్రాసానికి ఉపయోగపడే పంటలు కూడా పండించలేదు. ఒకవేళ అరకొరగా సాగుచేస్తే వచ్చే దిగుబడి పంట పొలాలల్లోనే నూర్పిడి చేస్తున్నారు. గడ్డివాములులేకపోవడంతో కల్లాలు కళావిహీనంగా మారాయి. పల్లెటూళ్లకు ఆనవాళ్లుగా కనిపించే గడ్డివాములు ఇప్పుడు మచ్చుక కూడా కనిపించవు. జనాభా పెరగడంతో కలాలన్నీ కాలనీలుగా మారాయి. గ్రాసానికి ఉపయోగపడే వేరుశనగ సాగుకు చాలా మంది రైతులు స్వస్తి పలికారు. విపరీతమైన ఖర్చులు రావడం, దిగుబడి దశలో గిట్టుబాటు ధరలేకపోవడం వంటి కారణాలు రైతులను అప్పులపాలు జేస్తున్నాయి. ఒకప్పుడు ఖరీఫ్‌లో వేల ఎకరాలల్లో కనిపించే వేరుశనగ పంట నేడు 10శాతం కనిపించలేదు. ఇక గ్రాసం కొనుగోలు చేయాలంటే రైతులు ఆర్థికపరంగా చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితిలో ఉన్నారు. దీంతో పూర్తిగా యాంత్రిక జీవనం మీద ఆధారపడాల్సి వస్తోంది. యంత్రాల సేద్యం చేయాలంటే డీజిల్, పెట్రోల్ ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. పొరుగు రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలోనే వాటి ధరలు ఎక్కువగా ఉన్నాయని సామాజిక విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందింది రైతులకు సేద్యపుటెద్దుల కోసం వడ్డీలేని రుణాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే పెట్రోల్, డీజిల్ ధరలు కూడా తగ్గిస్తే రైతులకు కాస్త ఊరట లభిస్తుంది. ఆ దిశగా ప్రభుత్వం స్పందిస్తుందని ఆశిద్దాం.

ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి
- పబ్బాపురం సమీపంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ
- స్థలం వద్ద అధికారులతో సమావేశం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: ఈ నెల 26 నుండి 29వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను ప్రోటోకాల్ నిబంధనల మేరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జేసీ అదితిసింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడులతో కలిసి జిల్లాలో ముఖ్యమంత్రి పాల్గొనే సికే.దిన్నె మండల పరిధిలోని పబ్బాపురం సమీపంలో ఏర్పాటు చేసే బహిరంగ సభా స్థలం వద్ద జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు జారీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో భాగంగా విధులు కేటాయించిన అధికారులందరూ ప్రోటోకాల్ నిబంధనలను తూచా తప్పక పాటించాలన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే సభా ప్రాంగణం, పరిసరాలలో పారిశుద్ధ్య పనులు పక్కాగా వుండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పాల్గొనే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా వుండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, డిపివో రాజ్యలక్ష్మి, డిఎంహెచ్ఓ డా. నాగరాజు, పోలీసు, ఫైర్ ఆఫీసర్ ధర్మా రావ్, విద్యుత్, ఆర్ అండ్ బి, పీఆర్ ఎస్ ఈ శ్రీనివాస రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు తొలగేలా చర్యలు తీసుకోవాలి

- కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: నగరంలోని ప్రకాష్ నగర్‌లో బహుళ అంతస్తుల భవనాల వద్ద ప్రధాన మురుగు కాలువలో గుర్రపు డెక్క వల్ల నిలిచిన మురుగును ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి మంగళవారం పరిశీలించి, తక్షణం గుర్రపు డెక్కను తొలగించి, మురుగు తొలిగేలా చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారు లను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వర్ష కాలాన్ని దృష్టిలో ఉంచుకొని, మురుగు కాలువల్లో అడ్డంకులను తొలగించాలన్నారు. కాలువల్లో చెత్త, చెదారాలు, ప్లాస్టిక్ బాటిల్లు వేయడం వల్ల మురుగు తొలగక, వర్షపు నీరు మురుగు కాలువల్లో చేరి, మురుగునీరు రోడ్లపై చేరడంతో అపరిశుభ్రత ఏర్పడుతుందని చెప్పారు. పరిసరాల సుబ్రత తోనే ఆరోగ్యం చేకూరుతుందన్నారు. వర్షాకాలానికి ముందే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడడమే లక్ష్య మన్నారు. ఈ పరిశీలనలో కార్పొరేషన్ కమిషనర్ మనోజ్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రం సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను హరించే 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలి

- దేశవ్యాప్త ఆందోళనలో సిఐటియు ఆధ్వర్యంలో ఆర్డిఓ కార్యాలయం వద్ద ధర్నా

విశాలాంధ్ర-కడప: కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వా లు అనుసరిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రెవిన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డిఓ గారికి వినతి పత్రం సమర్పించడం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు మాట్లాడుతూ స్వతంత్ర పూర్వం బ్రిటీష్ వారితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, ఆప్కాస్ సంస్థను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే చర్యలను విడనాడాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని, అసంఘటితరంగా కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాల్లో కూడా విస్తరింప చేయాలని, భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిమ్ లను సత్వరమే పరిష్కరించాలని, రాష్ట్రంలో 12వ వేతన సంఘాన్ని వెంటనే నియమించాలని ఆలోపు మధ్యంతర భృతి ఇవ్వాలని, సిపిఎస్ పెన్షన్ స్కీమ్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని తదితర సమస్యలను పరిష్కరించుటకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని లేనిపక్షంలో జూలై 9 వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహించవలసి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు గంగనపల్లె నాగార్జున, గంప సుబ్బరాయుడు, శివకుమార్,హరి, మున్సిపల్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు ,సత్యరాజు, దేవమ్మ, రామయ్య, నారాయణ పాల్గొన్నారు.

2029ఎన్నికల నాటికి వైసిపి ఉండదు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో రెండు నీటి ప్రాజెక్టులు కేవలం జమ్మలమడుగు నియోజకవర్గంలోనే గండికోట, మైలవరం డ్యాం లు ఉన్నాయని తెలిపారు.2029 ఎన్నికల్లో నాటికి తెలుగుదేశం పార్టీ కడప జిల్లాలో పదికి పది స్థానాలు కైవసం చేసుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కడపలో జరగబోయే మహానాడు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు విజయవంతం చేయాలని భూపేష్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దేవగుడి నారాయణరెడ్డి, జంబాపురం రమణారెడ్డి, టిడిపి రాష్ట్ర,జిల్లా కార్యవర్గ సభ్యులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫారం పాండ్ పనులను పరిశీలించిన పీడీ

మొదటి పేజీ తరువాయి

మంగళవారం అన్నమయ్య జిల్లా ఉపాధి పీడీ వెంకతరత్నం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఫారం పాండ్ పనుల చేపట్టిందని ఈ పనులు వలన రైతులకు నీటి నిల్వలు ఉండి అవసరమైనసమయంలో నీటి ఎద్దడి లేకుండా ఉపయోగపడుతుందని తెలిపారు. భూమిలోని నీటి నిల్వలు పెరిగి భూసారం పెరుగుతుందని, రైతులకు వివరించారు.పనులకు హాజరైన వేతన దారులు, వారికి ఇచ్చిన కొలతల ప్రకారం పని పూర్తి చేసుకుని రోజుకి సగటు 300రూపాయల పొందే విధంగా పనులు చేయాలని వేతన దారులకు, సిబ్బందికి సూచించారు. అంతేగాక ఉపాధి హామీ పథకం అమల్లో పూర్తిగా పారదర్శకత పాటించాలన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ అత్యధిక పనిదినాలు కల్పించి, ఆర్థిక భరోసా కల్పించాలని ఏపీఓ లకు సూచించారు. ఆయన వెంట ఏపీఓలు హరిబాబు, రామచంద్ర, టీఏ, ఎఫ్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని దేవాదాయ శాఖ భూములను పరిరక్షించాలి

విశాలాంధ్ర-రాయచోటి: జిల్లాలోని దేవాదాయ శాఖ భూములను తప్పనిసరిగా పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో దేవాలయ భూముల పరిరక్షణపై జిల్లాస్థాయి భూ సంరక్షణ కమిటీ సభ్యులతో కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తంగా 9761ఎకరాల దేవాలయ భూములు ఉన్నాయన్నారు. ఈ భూములన్నింటినీ కూడా తప్పనిసరిగా సంరక్షించాలన్నారు. ఎక్కడైనా ఆక్రమణకు గురై ఉంటే వెంటనే గుర్తించి వాటిని తొలగించాలని ఆదేశించారు. జిల్లాలో ఆక్రమణలో గుర్తించిన 1167.52 ఎకరాల భూములలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని, ఇందుకు సంబంధించి ఏదేని కోర్టుల్లో కేసులు ఉన్న వాటికి వెంటనే స్టే వెకేషన్ కొరకు కౌంటర్ దాఖలు చేయాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తంగా మొత్తంగా ఉన్న 9761ఎకరాలకు గాను గత సెప్టెంబర్ మాసంలో నిర్వహించిన సమావేశం నాటికి 4866 ఎకరాల భూములు 1బి అడంగల్ నందు దేవాలయ పేర్లు నమోదు కావడం జరిగింది. ప్రస్తుతం 5500 ఎకరాలకు సంబంధించి వన్ బి లో పేర్లు నమోదు కావడం జరిగిందన్నారు. ఇంకను దాదాపు 2200 పైబడిన భూములకు వెంటనే వన్ బి అడంగల్ నందు సంబంధిత దేవాలయ పేర్లు నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రెవిన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. దేవాదాయ శాఖ అధికారి సి.విశ్వనాథ్ మాట్లాడుతూ జిల్లాలో ఆలయాలకు చెందిన 5700 ఎకరాల భూములు ఖాళీగా ఉన్నాయని వాటిని గుర్తించాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, టెంపుల్ ఈవోలు, తనిఖీదారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి గంగయ్య అందిస్తున్న సేవలు అమోఘం

- రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదావీర్

విశాలాంధ్ర - కడప: గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఆఫ్రిది ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గంగయ్య అందిస్తున్న సేవలు విలువైనవని రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదా వీర్ అన్నారు. గత రెండు వారాలుగా సమ్మర్ క్యాంపులో గంగయ్య విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ పై శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం విద్యార్థులు ఆఫ్రిది, జె వి వి నాయకులు ఖాసిం వల్లి, మస్తాన్ వల్లి ఆధ్వర్యంలో గంగయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దాదా పీర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్లము పై పట్టు సాధించేలా గంగయ్య విద్యార్థులకు చక్కగా శిక్షణ ఇస్తున్నారన్నారు. విద్యార్థులు ఆంగ్ల భాష పై పట్టు సాధిస్తే మిగతా సబ్జెక్టులలోనూ చురుకుగా ఉంటారన్నారు. విద్యార్థులు మాహీన్, అయిమన్ మాట్లాడుతూ ఇంగ్లీషులో వ్యాకరణం,స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ లను గంగయ్య మాస్టారు చక్కగా వివరించారన్నారు. ఆంగ్లము పై పట్టు సాధించడానికి సమ్మర్ క్లాసులు తమకెంతో ఉపయోగపడ్డాయన్నారు. విద్యార్థుల కోసం సమ్మర్ క్లాసులు ఏర్పాటుచేసిన గ్రంథాలయ అధికారి ఆఫ్రిది, జెవివి నాయకులు దాదా పీర్,ఖాసీం వల్లి, మస్తాన్ వల్లి,పీర్ బాష లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గంగయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్ల భాషలో రాణించి అభివృద్ధి బాటలో పయనించాలనే ఉద్దేశంతోనే స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులు చెబుతున్నానన్నారు. విద్యార్థులు చక్కగా ఇంగ్లీషును అభ్యసిస్తున్నారంటూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు రంగనాయకులు, ఖాజావలి, సంజీవరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఒక వైపేమో కడప జిల్లాలో మహానాడు..మరొక వైపు జిల్లాకు అన్యాయం

- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



విశాలాంధ్ర – కడప: ఒక వైపు కడప జిల్లాలో మహానాడు నిర్వహిస్తూ మరొక వైపు టిడిపి కడప జిల్లాకు అన్యాయం చేస్తోందని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం పోరుమామిళ్లలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ టిడిపి కూటమి 11 నెలల పాలనలో కడప జిల్లాకు అనేక విధాలుగా అన్యాయం జరిగిందన్నారు. విభజన చట్టం ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యం లో ఏర్పాటు కావలసిన ఉక్కు కర్మాగారం ఏర్పాటు కాలేదు. విభజన చట్టం ప్రకారం బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ అమలు కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వని కారణంగా కడప – రాయ చోటి – మదన పల్లి – బెంగుళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గం పనులు నిలిచిపోయాయి. కడప – రాజం పేట – కోడూరు – రేణిగుంట జాతీయ రహదారి పనులు మొదలు కాలేదు. నేషనల్ మెడికల్ కమీషన్ పులివెందుల మెడికల్ కళాశాల కు 50 ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చేస్తే కూటమి ప్రభుత్వం వద్దని లేఖ వ్రాసింది.కళాశాల ప్రారంభం కాలేదు. కాసిరెడ్డి నాయన జ్యోతిక్షేత్రం లో కట్టడాలు కూల్చి వేసింది. తెలుగు గంగ, గాలేరు నగరి,వెలుగొండ ప్రాజెక్టుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం కొప్పర్తి పారిశ్రామిక వాడకు రు 250 కోట్ల తో ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్ ను మంజూరు చేయగా టిడిపి కూటమి ప్రభుత్వం దీనిని అమరావతికి తరలిస్తూ 24-9-2024 న జీవో జారీ చేసింది.ప్రజాగ్రహానికి భయపడి ఆ ప్రయత్నం తాత్కాలికంగా విరమించుకుంది. గతం లో జిల్లా నుండి ముఖ్య మంత్రి,ఉప ముఖ్య మంత్రి వుండేవారు. చంద్ర బాబు మంత్రి వర్గం లో జిల్లానుంచి కనీసం ఒక మంత్రి కూడా లేరు. టిడిపి కూటమి ప్రభుత్వం మూడు ధఫాలుగా కొండవీటి చాంతాడులా నామినేటెడ్ పదవులు ప్రకటించింది.అందులో కడప జిల్లానుంచి కనీసం ఒకరు కూడా లేరు. పుష్పక విమానం లాంటి టిటిడి బోర్డులో కడప జిల్లానుంచి ఒక్కరూ లేరు. మహానాడు లోపల పైన పేర్కొన్న అన్యాయాలలో కనీసం కొన్నింటినైనా పరిష్కరించాలని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి సూచించారు. ఈ సమావేశం లో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ అన్వర్, పీర, మహబూబ్ పీర్, ముజాహిద్, షైక్షా, ఆసిఫ్,అమర్ నాథ్ రెడ్డి,ఉత్తన్న, నాగరాజు, రమణ, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

- జాంబవ భవన నిర్మాణం కొరకు విరాళాల సేకరణ

విశాలాంధ్ర – కడప: ఎస్సీ వర్గీకరణ విజయ సారథి మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఎల్లవేళలా మాదిగ జాతి రుణపడి ఉంటుందని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి భిక్షాలు మాదిగ పిలుపునివ్వడం జరిగింది. మంగళవారం బద్వేలు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో బద్వేలు తాలూకా మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షులు ఎర్రబల్లె ఓబయ్య అధ్యక్షతన "మాదిగ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం" జరిగింది ఈ సమావేశంలో మాదిగ ఉద్యోగులు తమ సభ్యత్వాలను నమోదు చేసుకోవడమే కాకుండా మాదిగ జాతికి ఎస్సీ వర్గీకరణ విజయం సాధించినందుకు గాను గుర్తుగా మందకృష్ణ హైదరాబాదులో జాంబవ భవనం నిర్మాణము చేయడంలో విరాళాల సేకరణ వేగవంతం చేయాలని పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో కడప జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షులు పిచికే బాబు పాల్గొని సలహాలు, సూచనలు చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో జాతీయ, జిల్లా, తాలూకా నాయకులు, మాదిగ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదము చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు దేవానందం, శోభన్, గురయ్య, మాజీ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, ప్రసాద్, జయ చంద్రబాబు, ముండ్లపాటి పిచ్చయ్య, ఓ.ఎస్.వి ప్రసాద్, బాల ఓబయ్య , సుమన్, బాలయ్య, వీరయ్య, రవి, రాజారావు, కృష్ణయ్య, రవి, సుందరయ్య, శివయ్య, పాల్గొన్నారు.

జర్నలిస్టుల వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-రాజంపేట: జర్నలిస్టుల సంక్షేమం కోసం బుధవారం రాజంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రాజంపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరాన్ని మీడియా ప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని సూపరెంట్ నాగేశ్వర్‌రాజు అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు ఆయనతో సమావేశమయ్యారు. రక్త పరీక్షలు, కిడ్నీలు, గుండెకు సంబంధించిన పరీక్షలను నిర్వహించడం జరుగుతుం దన్నారు. అనంతరం వైద్య శిబిరానికి సం బంధించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు భాస్కర్, ప్రధాన కార్యదర్శి మందా శివయ్య, ఉపాధ్యక్షులు ఓబులేసు, మండ్ల శ్రీహరి, ఉదయగిరి కళ్యాణ్, నాగేం ద్ర ప్రసాద్, నరసింహ, దివాకర్, శివ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు దేశ సైనికులకు రుణపడి ఉండాలి

- పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు
- అట్టహాసంగా రాజంపేటలో తిరంగా భారీ ర్యాలీ

విశాలాంధ్ర-రాజంపేట: ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని, ప్రతి ఒక్కరు దేశ సైనికులకు రుణపడి ఉంటూ సమాజంలో వారికి విఐపి గౌరవం ఇవ్వాలని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజు తెలియజేశారు. మంగళవారం రాజంపేటలో భారత సైనికులకు మద్దతుగా నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీగా హాజరైన ప్రజలు, అఖిలపక్ష నాయకులతో కలిసి ఆయన ఆర్ అండ్ బి బంగ్లా నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో కులం లేదు మతం లేదు అందరిదీ ఒకటే జెండా అది భారతీయ మువ్వన్నెల జెండా అని, ప్రతి ఒక్కరూ ఆ జెండాకు గౌరవం ఇస్తూ ఆ జెండా కోసం సరిహద్దుల్లో కాపలా కాస్తూ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా దేశభద్రతకు పని చేస్తున్న సైనికులకు రుణపడి ఉండాలని, సమాజంలో ఎక్కడైనా సైనికులు కనబడితే వారికి విఐపి గౌరవం అందించి అందరూ వారిని గౌరవించాలని ఆయన తెలియజేశారు. దేశంలో నిజమైన వీఐపీలు అంటే సైనికులేననీ, వారి ప్రాణం అడ్డువేసి ప్రజల ప్రాణాలు కాపాడుతూ, దేశ గౌరవాన్ని కాపాడుతున్నారని ఆయన తెలియజేశారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషి స్తున్న పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెప్పిన భారత సైనికులకు మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో ఇంత పెద్ద ఎత్తున కులమతాలకు అతీతంగా అందరూ పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, మనం భారతీయులమని, మనం ఇక్కడే బతకాలని, మన జెండా మువ్వన్నెల జెండా అని, ఆ జెండా కింద ఉన్నంతవరకే మనకు గౌరవమని ప్రతి ఒక్కరూ దేశాన్ని ప్రేమిస్తూ, సైనికులను గౌరవిస్తూ దేశ సేవ కోసం, దేశ ప్రతిష్ట కోసం పాటుపడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, వివిధ శాఖల అధికారులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

సీఎం రిలీఫ్‌తో పేదల ప్రాణాలు కాపాడుతున్నాం: మైసూరా రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతో మంది పేదల ప్రాణాలను కాపాడుతోందని టిడిపి పార్లమెంటు కార్యదర్శి బొజ్జా మైసూరారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు పులివెందుల పట్టణంలో సిఎమ్ రిలీఫ్ చెక్కులను మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేముల మండలం గొందిపల్లి పంచాయితీ లోని రంగోరుపల్లె గ్రామంలో ఉండే కలమల్ల శ్రీనివాసులురెడ్డి లక్ష రూపాయలు లబ్ధిదారు నీ ఇంటి దగ్గరకే వెళ్లి చెక్కును అందజేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తాళ్లపల్లి వెంకటేశ్వర రెడ్డి, బొజ్జ గంగాధర్ రెడ్డి, గంగ చంద్రారెడ్డి, రమేష్ రెడ్డి, మదన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

రాయలసీమ అభివృద్ధి చెందాలంటే మహానాడు విజయవంతం చేయాలి

- కడప నగర అధ్యక్షుడు సానపు రెడ్డి శివ కొండారెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: రాయలసీమ అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే మహానాడును విజయవంతం చేయాలని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా శివకొండారెడ్డి తన కార్యాలయంలో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు ప్రజలు అందరూ కడపలో జరిగే మహానాడు ను విజయవంతం చేయాలన్నారు. రాయలసీమ అభివృద్ధి తెలుగుదేశం పార్టీ హయాంలోనే జరిగినదన్నారు. గాలేరునగరి తెలుగు గంగ ప్రాజెక్టుగాని మరి అనేకమైన నీటి ప్రాజెక్టులు చంద్రబాబు నాయుడు హయాంలోనే జరిగినవన్నారు. ముఖ్యంగా పారిశ్రామిక సీమ అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని బలపరచాలన్నారు. కియా కార్ల కంపెనీ గాని కొప్పర్తి ఇండస్ట్రియల్ గాని అది ఒక చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే అభివృద్ధి జరిగింది. రాయలసీమ యువతకు 3'50'583ప్రాశ్రామిక ఉద్యోగాలు రాయలసీమ వసున్నవి అన్నారు ఈ మహానాడు ను కడప నియోజకవర్గప్రజలు టీడీపీ నాయకులు కార్యకర్తలు నందమూరి అభిమానులు అందరు మహానాడు విజయంతం చేయాలనీ ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజయ భాగం ప్రధాన కార్యదర్శి సానపురెడ్డి రవి శంకర్ రెడ్డి కడప నగర టిడిపి ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య 47 డివిజన్ ఇంచార్జి కొండ్రెడ్డి జనార్ధన్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు నక్కల శివరాం జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు ప్రేమ్ కుమార్ నాయి బ్రాహ్మణ మాజీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల సేవలో మోడీ.. కార్మిక వర్గాన్ని విస్మరించిన బిజెపి ప్రభుత్వం

- కడప సబ్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నాలో ధ్వజమెత్తిన కార్మిక సంఘాల నాయకులు

విశాలాంధ్ర-కడప రూరల్: కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లు రద్దుచేయాలని, కోరుతూ కార్మిక సంఘాల కేంద్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం కడప సబ్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి, మనోహర్, మాట్లాడుతూ బ్రిటిష్ వాడితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోడీ మతోన్మాద ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్లు తెచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్ల వల్ల కార్పొరేట్ల లాభాలు పెరిగి, కార్మికులు ఏ హక్కులు లేని బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. 3 నల్ల చట్టాలతో రైతులను, 4 లేబర్ కోడ్లతో కార్మికులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కరోనా సంక్షోభాన్ని, ఉగ్రవాద సంక్షోభ పరిస్థితులను మోడీ మతోన్మాద ఎజెండాను అమలుపరిచేందుకు, కార్పొరేట్ శక్తులను సంతృప్తి పరిచేందుకు వాడుకుంటుందని వారు విమర్శించారు. ఇటువంటి కార్మిక వ్యతిరేక ప్రజావ్యతిరేక రైతు వ్యతిరేక విధానాలకు సమ్మెల ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జి వేణుగోపాల్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బీ దస్తగిరి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి అన్వేష్, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి బి లక్ష్మీదేవి, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసి.బాదుల్లా,ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె. మద్దిలేటి, అధ్యక్షులు సుబ్బరాయుడు, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నగర అధ్యక్షులు సుంకర రవి, ఏఐటీయూసీ నగర నాయకులు లింగన్న, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం నగర ప్రధాన కార్యదర్శి తారకరామారావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం నగర అధ్యక్షులు నరసింహ, ఏఐటీయూసీ నాయకులు మల్లికార్జున, ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం నగర ప్రధాన కార్యదర్శి శాంతమ్మ, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం నగర అధ్యక్షులు లక్ష్మీనరసమ్మ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం నగర నాయకులు.రాజశేఖర్, వెంకటాద్రి, చంద్ర, ఏఐటీయూసీ నగర నాయకులు రమణ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రులు ఆంధ్ర కేసరి, బ్రహ్మానంద రెడ్డిలకు నివాళి

విశాలాంధ్ర-వేంపల్లి: మాజీ ముఖ్య మంత్రులు స్వర్గీయ ప్రకాశం పంతులు 68 వ వర్ధంతిని, కాసు బ్రహ్మానంద రెడ్డి 31వ వర్ధంతిని మంగళవారం వేంపల్లిలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి మాట్లాడుతూ ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమర యోధునిగా,ఆంధ్ర రాష్ట్ర కమిటీ అధ్యక్షునిగా,సమైక్య మద్రాస్ రాష్ట్ర ముఖ్య మంత్రిగా అటు కాంగ్రెస్ పార్టీకి, ఇటు రాష్ట్రానికి ఎనలేని సేవ చేశారన్నారు. సైమన్ కమిషన్‌కు ఎదురొడ్డి ఆంధ్ర కేసరి గా పేరు గాంచారన్నారు.విజయవాడ వద్ద కృష్ణా నదిపై నిర్మించిన ప్రకాశం బ్యారేజి ఆయన మానస ప్రాజెక్టు.ఆయన బట్టలు ఆయనే ఉతుక్కునే వారట. అంతటి నిరాడంబరుడు. స్వర్గీయ కాసు బ్రహ్మానందరెడ్డి రాష్ట్ర మంత్రిగా, ముఖ్య మంత్రిగా, కేంద్ర మంత్రిగా, గవర్నరుగా, ఏఐసీసీ అధ్యక్షునిగా అటు కాంగ్రెస్ పార్టీకి,ఇటు రాష్ట్రానికి, దేశానికి ఎంతో సేవ చేశారన్నారు.ఆయన గొప్ప పరిపాలనా దక్షుడు.సిసలైన సమైక్యతా వాది.బీసీలకు విద్యా, ఉద్యోగాలలో 25 శాతం రిజర్వేషన్లు కల్పించిన బీసీల దేవుడు. ఈనాడు లక్షలాది మంది బీసీలు ఉన్నత చదువులు చదివి, ఉన్నత ఉద్యోగాలు పొంది,ఉన్నత ప్రమాణాలతో జీవించేటందుకు కారణం ఆయన కల్పించిన రిజర్వేషన్లు అని తులసి రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువ కుమార్ రెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేష్, పెండ్లి మర్రి మండల శాఖ అధ్యక్షుడు మహబూబ్ బాషా, చక్రాయ పేట మండల శాఖ అధ్యక్షుడు రామాంజనేయ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, అమర్‌నాథ్ రెడ్డి, ఉత్తన్న, బద్రి, నాగరాజు, రమణ, వినయ్, వేమా రాజా, వేమయ్య, మదార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ దురుద్దేశంతోనే అక్రమ అరెస్టులు: వైసిపి

విశాలాంధ్ర-పులివెందుల: కూటమి ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతోనే అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని వైసిపి నాయకులు విమర్శించారు. ఈ అక్రమ అరెస్టులు ఆపాలని మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఆర్డీవో రెడ్డి లక్ష్మికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయ దురుద్దేశం తో ప్రభుత్వ ఉన్నతాధికారుల పై అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారని, అందుకు ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి అరెస్టు ఒక నిదర్శనమన్నారు. దివంగతనేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పులివెందుల ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన పాడా సంస్థ ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహిస్తూ, పులివెందుల ప్రజలతో మమేకమవుతూ ఈ ప్రాంతానికి సుపరిచిత వ్యక్తిగా, ఎటువంటి అవినీతి ఆరోపణ లేకుండా మంచి ప్రభుత్వ అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. గత 20ఏళ్లుగా పులివెందుల ప్రాంత ప్రజలకు, ప్రాంతానికి ప్రత్యక్షంగా పరోక్షంగా సేవ చేస్తున్న వ్యక్తి అరి ఇటువంటి ప్రభుత్వ అధికారిపై, మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి మీద కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగంగా అక్రమ కేసుల్లో ఇరికించడం బాధాకరమన్నారు. ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి కాకుండా మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డిపై, పీఎస్ ఆంజనేయులు లాంటి ఉన్నత అధికారులపై అక్రమ కేసు లు పెట్టి వేధించడం వంటి కార్యక్రమాలు మానుకొని హోమ్ మినిస్టర్, ముఖ్యమంత్రి ప్రజా సంక్షేమం అభివృద్ధి పై దృష్టి పెట్టాలని మీడియా ద్వారా వారికి తెలియచేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మునిసిపల్ ఛైర్మెన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మెన్ చిన్నప్ప, పులివెందుల పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, రాష్ట్ర మాజీ ఛైర్మెన్ రసూల్, వైస్ ఛైర్మెన్ హాఫీజ్, పట్టణ ఉపాధ్యక్షులు పార్నపల్లి కిషోర్, రాష్ట్ర బూత్ కమిటీ నాయకులు చంద్రమౌళి, కౌన్సిలర్లు రాజశేఖర్‌రెడ్డి, ఖాదర్ భాషా, పద్మనాభ రెడ్డి, కో ఆప్షన్ చంద్రమౌళి, వైసీపీ నాయకులు రంగాపురం మధు, కోళ్ల భాస్కర్, కృష్ణమూర్తి, విజయ్ భాస్కర్ రెడ్డి, రవి, తోటం శెట్టి హరి, శ్రీరాములు, యూత్ నాయకులు జశ్వంత్ రెడ్డి, మారుతి రెడ్డి, ప్రశాంత్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ప్రిన్సిపల్ అన్నారెడ్డి బాలిరెడ్డి నేత్రదానం

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణం చిన్నన్న రూమ్ లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ అన్నారెడ్డి బాలిరెడ్డి (82 సంవత్సరాలు) మంగళవారం మరణించడం తో అయన భార్య వెంకట లక్షుమ్మ, కుమారులు దామోదర్ రెడ్డి, శరత్ చంద్ర రెడ్డి, కుమార్తె పూర్ణిమ జ్యోత్స్న, కోడళ్ళు రూప సుమన, సుచిత లు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ మరియు స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు లకు సమాచారం ఇవ్వడం తో టెక్నీషియన్ హరీష్ తో కలిసి మృతుని నివాసం వెళ్లి పార్థివ దేహం నుండి కార్నియా లను సేకరించి హైదరాబాద్ లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధి కి పంపడం జరిగింది. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానం చేయడం ద్వారా అంధత్వం తో బాధ పడుతున్న అంధుల కు చూపు ఇచ్చి అంధ రహిత సమాజం గా నిర్మించేందుకు ప్రతి ఒక్కరు నేత్రదానం పై అవగాహన కలిగి 9966509364 లేదా 7093204537 లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులకు విశ్రాంత సైనికులు గంగిరెడ్డి, గోపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రవిచంద్ర రెడ్డి, భూపాల్ రెడ్డి, బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

తహసీల్దార్ అక్రమాలకు పాల్పడ్డారు

- ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారు
- విచారించి చర్యలు తీసుకోండి
- ఏసీబీ అధికారులకు సీపీఐ నాయకులు వినతి
- మీడియా సమక్షంలో విన్నపాన్ని స్వీకరించేందుకు అధికారులు నిరాకరణ

విశాలాంధ్ర-కడప రూరల్: రిజిస్ట్రేషన్ నిషేదిత జాబితా 22ఏలో ఉన్న భూములను ఫ్రీ హెరీల్డ్లో అక్రమాలకు పాల్పడిన తహసిల్దార్ ఆదాయానికి మించి ఆస్తులపై విచారణ చరిపి చర్యలు తీసుకోవాలి అని మంగళవారం స్థానిక ఓల్డ్ రిమ్స్‌లోని ఏసీబీ కార్యాలయంలో సీఐ నాగరాజును సిపిఐ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ దేశంలో అనేక పోరాటాల ఫలితంగా భూమిలేని గ్రామీణ వ్యవసాయ కూలీలకు సాగుభూమి పంపిణీ చేసేందుకు అసైన్మెంట్ ద్వారా భూమి మంజూరు చేసే పథకం తీసుకురాబడింది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో అనేకమంది వ్యవసాయ కూలీలు భూమిని పొంది సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ భూమిపై గతంలో అనేక ప్రభుత్వాలు అమ్ముకోవడం, కొనుగోలు చేయడం అనుమతించాలని ప్రయత్నించి ప్రజల తిరుగుబాటుతో ఉపసంహరించుకోవడం జరిగింది అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో అసైన్మెంట్ భూములను పొంది 20 సంవత్సరాలు అనుభవం కలిగి ఉన్న వారి భూములపై పూర్తి హక్కు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ నిషేదిత జాబితా 22ఏ చట్ట సవరణ ద్వారా ఫ్రీహెరీల్డ్ కల్పించడం జరిగింది. ఈ చట్ట సవరణ జరగడానికి ముందే రాష్ట్రంలో వైసిపి నాయకులు, వారి బంధువులు ఒక ప్రణాళికబద్ధంగా ఎస్సీ, ఎస్టి, బిసి, మైనారిటీ, ఈబిసిల చేతుల్లో ఉన్న భూములను సామ, దాన, దండోపాయాలను ఉపయోగించి కారుచౌకగా కొనుగోలు చేయడం, తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు అని ఆరోపించారు. రిజిస్ట్రేషన్ నిషేదిత భూముల చట్టం 22ఏ ను సవరించి ఫ్రీహెరీల్డ్ చేసిన ప్రభుత్వ నిర్ణయం ప్రకారం గ్రామస్థాయిలో అసైన్మెంట్ ద్వారా భూములు పొంది, 20 సం. రాలు అనుభవం కలిగి ఫ్రీహెరీల్డ్‌కు అర్హులైన వారి జాబితాపై అభ్యంతరాలకు గడువు ఇచ్చి, తదుపరి తహసిల్దార్, ఆర్‌డిఓ, జిల్లా జాయింట్ కలెక్టర్ ద్వారా కలెక్టర్ ఆమోదం ఇవ్వాలన్న నిభందనలను తహసిల్దార్ స్థాయిలో నిభందనలను ఉల్లంగించారు అన్నారు. బద్వేల్ మండలం, చెన్నపల్లె గ్రామ పొలంలో ఒక వైసిపి నాయకుడు దళితులకిచ్చిన అసైన్మెంట్ భూమిపై తప్పుడు కొనుగోలు డాక్యుమెంట్స్ సృష్టించి ఫ్రీ హెరీల్డ్ అయిన అసైనీతో ప్రమేయం లేకుండా, రిజిస్ట్రేసన్ చేయకుండానే రాత్రికి రాత్రి మ్యుటేషన్ చేసి ఒక ఎస్‌సి చెందిన భూమి బిసికి అనువంశికం అని నమోదు చేసిన తహసిల్దార్ ఏ స్థాయిలో అవినీతికి పాల్పడి ఉంటాడో మనకు అర్థమవుతుంది. జిల్లాలో అనేక చోట్ల తహసిల్దార్లు భూవివాదాలను పరిష్కారం చేయకపోవగా ఎవరు డబ్బులిస్తే వారి పేరుమీద నమోదు చేయడం గత ప్రభుత్వంలో నిత్యకృత్యంగా జరిగాయి. ఎవరైనా ప్రశ్నిస్తే వారి పైనే అక్రమ కేసులు బనాయించడం లాంటి ఘటనలు కూడా ఉన్నాయి అన్నారు. గత ప్రభుత్వంలో ఫ్రీహెరీల్డ్లో జరిగిన అక్రమాల పై ప్రభుత్వం చేపట్టిన విచారణలో జిల్లాలో గతంలో పనిచేసిన 13మంది తహసిల్దార్లు ప్రస్తుతం కొందరు ఆర్‌డిఓ స్థాయిలో, వేరే మండలాల్లో పనిచేస్తున్న అనురాధ (మైదుకూరు) గంగయ్య(పోరుమామిళ్ళ) మధుసూధన్రెడ్డి (బద్వేల్) విజయకుమారి (వివన్నపల్లి) లక్ష్మినారాయణ (లింగాల) మహ బూబ్ బాషా (సింహాద్రిపురం) గుర్రప్ప (జమ్మల మడుగు) ఎఉదయభాస్కరరాజు (పెండ్లిమర్రి), సువర్ణ(బి.మఠం), సరస్వతి (కమలాపురం)రామచంద్రుడు (కాశీనాయణ) వెంకటసుబ్బయ్య (వేముల) శంకర్రావు (వల్లూరు) అక్రమాలకు పాల్పడినట్టు, వారికి జిల్లా కలెక్టర్ గారు షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు ప్రకటలను వెలువడిన నేపథ్యంలో తహసిల్దార్ల స్థాయిలో ప్రభుత్వ నిభందనలకు విరుద్ధంగా ఫ్రీహెరీల్డ్ సిఫారసులు చేయడానికి భారీగా ముడుపులు తీసుకున్నట్లు అభియోగాలు కూడా ఉన్నాయి. వీరిపై గతంలో కూడా వీరిపై అనేక అభియోగాలున్న నేపద్యంలో వీరంతా నిభందనలు అతిక్రమించి అవినీతికి పాల్పడి ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టుకున్నారన్న ఆరోపణలు ఉన్నందున వీరి ఆస్తులపై విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మీడియా సమక్షంలో వినతిపతన స్వీకరించేందుకు నిరాకరించడంతో మీడియా లేకుండానే వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ నాగ సుబ్బారెడ్డి, ఎన్. వెంకట శివ, జి వేణుగోపాల్, బాదుల్లా, మద్దిలేటి, మునయ్య, మల్లికార్జున, భాగ్యలక్ష్మి, ప్రభాకర్, చంద్ర, అరుణ్, ఓబులయ్య పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర-రాజంపేట: కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా మంగళవారం ఉదయం రాజంపేట పట్టణంలోని బైపాస్ రోడ్ లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏఐటీయూసీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగినది. దేశంలో ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాయిదా పడిన నేపథ్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా కార్యదర్శి సికిందర్ మాట్లాడుతూ కార్మిక , కర్షకులకు నడ్డి విరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని తెలిపారు. కార్మికులకు కార్మిక శాఖ ద్వారా సభ్యత్వాలను నమోదు చేసి సంక్షేమ పథకాలను అమలు చేయాలని తెలిపారు. నిరసన కార్యక్రమం లో రాజంపేట ఏఐటీయూసీ నియోజ కవర్గ ఉపాధ్యక్షు నాగేశ్వరరావు. రమణ పరమే కారి సుబ్రహ్మణ్యం. రవి ఆటోవర్కర్ సాయి. కిరణ్ బజారి హమా యూనియన్ తులసినాయక్ రామాంజనేయులు అంజినా యక్ కృష్ణచంద్ర అంజి, బలరాం పాల్గొన్నారు.

మారెమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పెద్దమండ్యం: మండలంలోని ఓబన్నగారిపల్లి పంచాయతీ తండాలలో వెలి సిన మారెమ్మ జాతరలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. సర్పంచ్ తిరు పాల్ పద్మావతినాయక్, ఎస్‌టి సెల్ అధ్య క్షులు రెడ్డప్పనాయక్ ఆహ్వానం మేరకు ఆ యన విచ్చేశారు. గ్రామంలో ప్రజలతో మ మేకమై అందరిని పేరు పేరునా పలకరిం చారు. మండలంలోని వైసీపీ జిల్లా యాక్టివి టీ కార్యదర్శి మధుకర్‌రెడ్డి, మండల అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి, కార్యకర్తలకు పాల్గొన్నారు.

నా భర్త ఆచూకీ తెలపండి సారూ..

- మీడియా ఎదుట కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యుల ఆవేదన

విశాలాంధ్ర-రాజంపేట: బ్రతుకుతెరువు కోసం 8 నెలల క్రితం కువైట్ వెళ్లిన నా భర్త రాజ బోయిన మనోహర్ ఈనెల 17 వ తేదీన ఇంటికి వస్తున్నట్లు చారవాణి ద్వారా తెలియజేసి ఐదు రోజులు అవుతున్న, ఇప్పటివరకు ఇంటికి రాలేదని, పట్టణ కేంద్రంలోని రాంనగర్లో నివాసం ఉన్నటువంటి రాజ బోయిన మనోహర్ భార్య రాజేశ్వరి, కుటుంబ సభ్యులు మంగళవారం మీడియా ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కుమార్తె గర్భవతి కావడంతో ఇంటికి వచ్చేందుకు 17వ తేదీన టికెట్ బుక్ చేసుకుని కువైట్లో శ్రీలంక విమానం ఎక్కి వస్తున్నట్లు చెప్పడం జరిగిందన్నారు. తర్వాత పలుమార్లు ఆయనకు ఫోన్ చేస్తుంటే మొబైల్ పనిచేయలేదు అన్నారు. దీంతో ఐదు రోజుల నుండి ఎదురుచూస్తున్నట్లు వాపోయారు. అంతేకాకుండా తమ భర్త గతంలో కూడా కుటుంబాన్ని పోషించడానికి కువైట్ కు వెళ్లి ప్రతి రెండేళ్లకు ఒకసారి ఇంటికి వచ్చేవారన్నారు. ఇటువంటి నేపథ్యంలో ఈసారి ఇంటికి రాకపోవడంతో తమ భర్తకు ఏమైందో అంటూ బోరున వినిపిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి తమ భర్త ఆచూకీ తెలపాలని వేడుకుంటున్నారు. ఇప్పటికే ఈ విషయమై పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసేందుకు వెళుతున్నట్లు తెలిపారు.

వడ్డీ వ్యాపారస్తుల దాష్టీకం దారుణం

- వృద్ధ మహిళల ఇంట్లో సామాన్లను కాజేసి ముసలోళ్ళను గెంటేసి ఇంటికి తాళం వేసిన అల్లరి మూకలు
- మూడు రోజులుగా తాళం వేసిన ఇంటి బయటే ఉన్న వృద్ధ తల్లి, పెరాలసిస్ కూతురు
- ఇంటి వద్ద బాధితులతో కలిసి నిరసన వ్యక్తం చేసిన సిపిఐ, ఆర్‌సిపి నాయకులు

విశాలాంధ్ర-కడప రూరల్: ఇంట్లో సామాన్లను బయటికి తరలించి, వృద్ధ మహిళలపై దాడి చేసి బయటికి గెంటేసి , ఇంటికి తాళం వేసి అమానుషంగా వ్యవహరించిన బాల గురవయ్య, వారి కుమారులపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, ఇంటి బేగం తీయించి రుద్ధ మహిళలను యధావిధిగా ఇంట్లో ఉంచాలని సిపిఐ నగర కార్యదర్శి యన్. వెంకట శివ, ఆర్‌సిపి నాయకులు ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక శివానందపురంలో బాధితుల ఇంటి వద్ద సిపిఐ, ఆర్సీపీ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకట శివ, ప్రసాద్ మాట్లాడుతూ కడప నగరం, 15 డివిజన్, శివానందపురంలో మనవరాలు పెళ్లి కోసం నాలుగేళ్ల కిందట చేసిన 4 లక్షల అప్పు చెల్లించలేదని భూమన పిచ్చమ్మ కు చెందిన ఐదు సెంట్ల స్థలము కాజేసేందుకు కుట్ర పన్నిన బాల గురయ్య మరియు వారి కుమారులు బలవంతంగా కుదువ డాక్యుమెంట్ రాయించుకుని సంబందీకుల ప్రమేయం లేకుండానే ఫోర్జరీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేసుకొని అక్రమాలకు పాలపడ్డారన్నారు. వృద్ధ మహిళల బలహీనతలను ఆసరా చేసుకున్న అక్రమార్కులు మూకుమ్మడిగా దాదాపు పది మందికి పైగా బాల గురవయ్య, మురళి, బాలచంద్ర,బాలుడు, ఓబులేసు, ఓబుళపతి, లక్ష్మీదేవి, బాలమ్మ తదితరులు గత ఆదివారం ఇంట్లోకి చొరబడి పిచ్చమ్మ పై దాడి చేసి ఇంట్లో ఉన్న గ్యాస్, పొయ్యి, వస్తువులు, బట్టలు, ట్రంకు పెట్టెలు అందులో ఉన్న మూడు బంగారు ఉంగరాలు, పదహారువేల డబ్బులు, ఇతర వస్తువులు సామాన్లు అన్నింటిని టాటా ఏసి గూడ్స్ వెహికల్ లో తరలించుకుని పోయి కాజేశారన్నారు. సామాన్ల తరలింపును అడ్డుకున్న పిచ్చమ్మ ను వారి కూతురు పేరాలసిస్ పేషెంట్ వెంకటసుబ్బమ్మ పై దాడి చేసి మొబైల్ ఫోను ను కింద పడేసి పగల కొట్టి ఇంటికి తాళం వేసి విచక్షణారహితంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఆదివారం మధ్యాహ్నం నుండి నుండి ఇంటి బయటే ,వర్షములో తడుస్తూ, ఎండలో ఎండుతూ ఇంటిని చూపెట్టుకొని తిని తినక అష్ట కష్టాలు పడుతూ ఉన్న పిచ్చమ్మ, వారి కూతురు వెంకటసుబ్బమ్మ కు న్యాయం చేయాలని పోలీసులను సైతం ఆశ్రయిస్తే ఇంతవరకు సమస్య పరిష్కారం కాకపోవడం దారుణమన్నారు. ఇంటి దగ్గరే ఉంటే ఇద్దరిని చంపుతామని కూడా బెదిరిస్తున్నారని, బిక్కుబిక్కుమంటూ వారు కన్నీరుమున్నీరు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవతా దృక్పథంతో సంబంధిత అధికార యంత్రాంగం వృద్ధ మహిళల పట్ల కనికరం చూపి వారికి న్యాయం చేయాలని, వారిని ఇబ్బందులకు గురి చేసిన వారందరిపై కేసులను నమోదు చేయాలన్నారు. ఈ ఇరువురి బాధితులకు న్యాయం జరిగేంత వరకు ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ,ఆర్‌సిపి నాయకులు మల్లికార్జున, భాగ్యలక్ష్మి, విజయ్, రమేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొలతలకు సహకరించండి: కమిషనర్

విశాలాంధ్ర-యర్రగుంట్ల: పురపాలిక శాఖ సంచాలకుల ఉత్తర్వుల మేరకు పట్టణ పరిధి లో ప్రతి ఇంటిని మరో మారు కొలతలు వే యాల్సి ఉందని ఈ నేపథ్యంలో కొలతల కోసం ఇళ్ల వద్దకు వచ్చే సచివాలయాల సిబ్బందికి సదరు యజమానులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శేషఫణి విజ్ఞప్తి చేశారు. యర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటిని నగర పంచాయతీ రికార్డులతో సరిచూడవలసి ఉన్నదని కమిషనర్ వివరించారు. ప్రతి ఇంటిని మరోసారి కొలతలు నిర్వహించి ఈఆర్పీ వెబ్‌సైట్‌లో ఉన్న కొలతలకు క్షేత్రస్థాయిలో ఉన్న కొలతలకు ఏవైనా వ్యత్యాసం ఉన్నట్లయితే సదరు డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కొలతలు నిర్వహించడం జరుగుతుందని పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తాం

విశాలాంధ్ర-రాయచోటి: తమ న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని అన్నమయ్య జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 23రోజులవుతున్న రాష్ట్ర ప్రభుత్వం కానీ వైద్యారోగ్య శాఖ మంత్రి పట్టించుకోకపోవడం దారుణమని ఆరోపించారు. తమ సమస్యల పరిష్కారమయ్యేంతవరకు సమ్మెను విరమించే ప్రసక్తే లేదని వారు వెల్లడించారు. సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి వైద్య సేవలు అందించి వారి ఆరోగ్యానికి బాసటగా నిలుస్తున్న తమపై ప్రభుత్వం కక్ష సాధింపుగా వ్యవహరించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. తమ డిమాండ్ తీర్చక పోతే త్వరలో ఆందోళన ఉధృతం చేయడానికి భవిష్యత్తు ప్రణాళిక రూపొందిస్తామని వారు తెలిపారు. జిల్లా కలెక్టరేట్ ఎదుట 23 రోజులుగా నిరసన చేస్తున్నారు. జిల్లాలోని హెల్త్ క్లినిక్‌లో పనిచేస్తున్న 375 మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు అందరూ సమ్మె చేస్తుండడంతో ప్రజలకు వైద్య సేవలు స్తంభించి పోయాయి. గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలకు వైద్య సేవలు స్తంభించడంతో పేద ప్రజలు కార్పొరేట్ వైద్యానికి వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సమ్మెను విరమింపజేసి పేద ప్రజలకు వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమ్మెలో జిల్లా ఏపీఎం సిపి నాయకులు సాల్మోహన్, అహ్మద్ భాషా, శివకుమార్, ప్రవీణ పాల్గొన్నారు.

జెసిటీ కాలేజిలో పులివెందుల విద్యార్థినికి ఫస్ట్‌ర్యాంక్

విశాలాంధ్ర-పులివెందుల: పట్టణానికి చెందిన ముస్లిం మైనారిటీ నాయకులు నూరుల్లాహ్ కుమార్తె షేక్.నాఫియా తబస్సుమ్ అన్నా యూనివర్సిటీకి అనుసంధానమైన జె.సి.టీ కాలేజీలో ఫస్ట్ ర్యాంక్ సాధించి రెండు స్వర్ణ పతకాలను కైవసం చేసుకుందని తండ్రి నూరుల్లాహ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ జెసిటి ఇంజనీరింగ్ టెక్నాలజీ కాలేజ్ ఆఫ్ కోయంబత్తూర్లో ఈసీఈ పూర్తి చేసి కాలేజీలోని ఫస్ట్ ర్యాంక్ వచ్చిన శుభ సందర్భంలో కాలేజ్ యాజమాన్యం రెండు స్వర్ణ పతకాలను బహుకరించినట్లు షేక్ నాఫియా తబస్సుమ్ తండ్రి పులివెందుల వాసి జిల్లా వైసిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లాహ్ తెలుపుతూ సంతోషం వ్యక్తం చేస్తూ ప్రతి విద్యార్థిని విద్యార్థి ఇష్టపడి ఉన్నత చదువులు చదివి అటు కాలేజీకి తల్లిదండ్రులకు మంచి పేరు సంపాదించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

హరిజనవాడకు ముళ్ళ కంచె తొలగించాలని వినతి

విశాలాంధ్ర-సుండుపల్లె: మండల పరిధిలోని గుండ్ల పల్లి పంచాయతీ కేతిరెడ్డిగా రిపల్లి మాదిగపల్లెకు అదే గ్రామానికి చెందిన అగ్రికులస్తులైన యలమంచి రామయ్య నాయుడు, నీలమ్మ మాదిగ పల్లికు వెళ్లేందుకు రహదారి లేకుండా ముళ్ళకంచి వేసి నిర్బంధించాలని మంగళవారం తాసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేతిరెడ్డిగారిపల్లి మాదిగపల్లిలో చెందిన 80 కుటుంబాలు దాదాపుగా ఎన్నో తరాల నుంచి పక్కా గృహాలతో సిసి రోడ్లతో మురికి కాలువలతో గ్రామములో జీవనం చేస్తూ ఉంటున్నారని అయితే ఇప్పుడు పక్క గ్రామానికి చెందిన యలమంచి రామయ్య నాయుడు నీలమ్మ అనే వీరు ఆ గ్రామాన్ని పూర్తిగా ముళ్ళ కంచెతో బయటికి పోనీయకుండా జీవాలకు గాని కానీ పల్లె లోని ప్రజలు కాలకృత్యాలు తీర్చుకోవడానికి గాని బయటకు పోనీకుండా పూర్తిగా బంద్ చేయడం జరిగింది ఈ విషయంపై ఈరోజు గ్రామస్తులు మండల తాహసిల్దార్ మా గ్రామానికి శాశ్వతమైన రహదారిని కల్పించాలని అదేవిధంగా మా గ్రామానికి పక్కన ఉన్నటువంటి కుంటను కూడా ఆక్రమించుకున్నారని దీనివలన మాకు చాలా సమస్యలు ఉత్పన్నమవుతాయని వినతిపత్రం ద్వారా తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఆర్పిఎస్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు వరం.. జాబ్ మేళా

- అర్హులైన ప్రతి ఒక్కరికి ఉద్యోగ అవకాశాలు
- రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి

విశాలాంధ్ర-రాజంపేట: నిరుద్యోగులకు జాబ్ మేళా వరం లాంటిదని రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. మంగళవారం రాజంపేట మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతను దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తోందన్నారు. అందులో భాగంగానే రాజంపేట పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన జాబ్ మేళా కార్యక్రమానికి యువత పెద్ద సంఖ్యలో హాజరు కావడం జరిగింది అన్నారు. నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. ఉద్యోగం యువతకు ఎంతో అవసరం, ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం లభించడం సాధ్యం కాదని, అందుకే కూటమి ప్రభుత్వం తరుపున నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాలో అనేకమంది నిరుద్యోగ యువత ఉద్యోగాలు పొందడం ఎంతో ఆనందంగా ఉందని, భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు, అలాగే స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో లక్షలాదిమంది నిరుద్యోగులు కల్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, టిడిపి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలు ఆవిష్కరణ

విశాలాంధ్ర-యర్రగుంట్ల: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మూడవ కౌన్సిల్ సమావేశం విజయవాడలో జరుగనున్న నేపథ్యంలో సంఘం కమలాపురం నియోజకవర్గ అధ్యక్షులు ఓబులేసు సమావేశానికి సంబంధించిన గోడపత్రాలను మున్సిపల్ కమీషనర్ శేషఫణి చేతుల మీదుగా ఆవిష్కరింపచేశారు. ఈ సందర్భంగా ఓబులేసు మాటాడుతూ విజయవాడలో జరిగే సమావేశంలో ఉద్యోగులకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలపై చర్చించడం జరుగుతుందని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు వీలుగా కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కూడా ఆహ్వానించడం జరుగుతుందని ఆ మేరకు ఆయన కూడా సమావేశంలో పాల్గొనే అవకాశం ఉందని కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఓబులేసు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డేటా ఎంట్రీ ఆపరేటర్ వినోద్‌కుమార్ రెడ్డి, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డా.శ్రీనాథ్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ అహ్మద్, ఫార్మసిస్టు సుభాష్, ఏఎన్ఎం సుబ్బమ్మ, జయపాల్ పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలు ధిక్కరించిన రాయచోటి తాహసిల్దార్‌కు నోటీసు

విశాలాంధ్ర-రాయచోటి రూరల్: ఒక సివిల్ కేసులో రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఇచ్చిన ఇంజక్షన్ ఆదేశాలను ధిక్కరించినందుకు రాయచోటి తాసిల్దార్ మున్సిపల్ కమిషనర్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కు బ్రాహ్మణ వీధికి చెందిన పాముల మల్లికార్జున అనే వ్యక్తి నోటీసులు జారీ చేసినట్లు భారత న్యాయవాదుల సంఘం కడప ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ తెలియజేశారు. రాయచోటి పట్టణం బ్రాహ్మణ వీధికి చెందిన మల్లికార్జున అనే వ్యక్తికి ఉన్న ఇంటి జాగాలో అదే వీరికి చెందిన బండి మురళి బండి హరినిలు దౌర్జన్యంగా తన స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు ఓ.ఎస్.నెంబర్. 121/23 సివిల్ కేసును దాఖలు చేయగా సదరు వ్యక్తులు పాముల మల్లికార్జున జాగాలోకి వెళ్లకూడదని 10.04.2023 కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇంజక్షన్ ఆర్డర్ ఇప్పటికీ కూడా అమలులో ఉంది. ఈ విషయం రాయచోటి తాసిల్దార్ తెలిసినప్పటికీ మల్లికార్జున కుటుంబ సభ్యులను 20.05.2025 తాసిల్దార్ ఆఫీస్ కు పిలిపించి ఎగతాళిగా మాట్లాడుతూ ఇలాంటి పేపర్లు చాలామంది తెస్తారులే!! అని మల్లికార్జున కు వ్యతిరేకంగా అతని ప్రత్యర్థులను తాసిల్దార్ సపోర్ట్ చేసి కోర్ట్ ఆదేశాలను దిక్కరించడమే గాక కోర్ట్ ఆదేశాలనే అవమానపరుస్తూ తన స్థలంలో తన ప్రత్యర్థుల చేత గుంతలు తొవ్విస్తున్నాడని పాముల మల్లికార్జున తాసిల్దార్ కు మున్సిపల్ అధికారులకు ఈరోజు నోటీసులు జారీ చేశారు. అని న్యాయవాది టి.ఈశ్వర్ తెలియజేశారు. కోర్టు ఆదేశాలు ధిక్కరించిన వారిపై ప్రైవేటు కేసు దాఖలు చేస్తాం. కోర్టు ఆదేశాలను ధిక్కరించిన వారి పైన దిక్కరించడానికి సహకరిస్తున్న రాయచోటి తాసిల్దార్ నరసింహ కుమార్ సంబంధిత మున్సిపల్ అధికారులపైన ప్రైవేట్ కేసు దాఖలు చేయనున్నట్లు న్యాయవాది టీ.ఈశ్వర్ తెలియజేశారు.

మిట్స్‌లో గేట్ 2025 అర్హత సాధించిన విద్యార్థులకు ప్రశంస

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె సమీపంలో గల మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్(మిట్స్) కళాశాలలో జాతీయ స్థాయిలో నిర్వహించే గేట్ 2025 అర్హత సాధించిన విద్యార్థులను ప్రశంసా కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యువరాజ్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ పరీక్ష లో విజయవంతంగా అర్హత సాధించిన విద్యార్థులకు ప్రశంసా కార్యక్రమాన్ని నిర్వహించామని ఆయన అన్నారు. మొత్తం 22 మంచి విద్యార్థులు కళాశాలలో గేట్‌కు అర్హత అయ్యారని, అందులో సివిల్ ఇంజనీరింగ్ నుంచి 2, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరిం గ్ విభాగము నుంచి 9, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ నుంచి 5, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి 2, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ 4, డేటా సైన్స్ ఒక్కరు అని ఆయన అన్నారు. ఆయన విద్యార్థుల కృషిని ప్రశంసించారు. ఈ అద్భుతమైన మైలురాయి వైపు వారిని నడిపించడంలో అధ్యాపకుల నిరంతర మద్దతును ప్రశంసించారు. తన ప్రసంగంలో, గేట్ వంటి పోటీ పరీక్షల ప్రాముఖ్యతను ఆయన చెప్పారు, ఇది ప్రతిష్ఠాత్మకమైన ఉన్నత విద్య సంస్థలకు మరియు ప్రభుత్వ రంగ సంస్థలు పరిశోధనా సంస్థల్లో అవకాశాలకు నాంది అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన మొత్తం 22 మంది విద్యార్థులను వారి కృషి, పట్టుదలకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు. విభాగాధిపతులు, అధ్యాపక సభ్యులు, మార్గదర్శకులు కూడా విజేతలను అభినందించడంలో పాల్గొన్నారు. జూనియర్లకు స్ఫూర్తినిచ్చే ప్రేరణాత్మక అంతర్దృష్టులను పంచుకున్నారు. గేట్ అర్హత సాధించిన వారు తమ తయారీ వ్యూహాలు మరియు అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్, డీన్ శ్రీమంత బసు అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులను కరెస్పాండెంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల అభినందనలు తెలియజేశారు.

సయ్యద్ మహమ్మద్‌కు నివాళి

విశాలాంధ్ర-సుండుపల్లె: మండల కేంద్రం నుంచి రాజంపేట నుండి రాయవరానికి సోమవారం బైక్‌పై వెళుతూ మార్గమధ్యంలో రెండు వాహనాలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన మాజీ సర్పంచ్ రఫీ చిన్నతమ్ముడు సయ్యద్ మహమ్మద్ మరణ వార్త తెలుసుకున్న చమర్తి మంగళవారం రాయవరానికి చేరుకొని సయ్యద్ మహమ్మద్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షుడు కల్లే రెడ్డప్ప, మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబు నాయుడు, నాయకులు శివరాంనాయుడు, ప్రసాద్‌రాజు, చంద్రమౌళి, కిరణ్‌కుమార్ నాయుడు, సుబ్బరామరాజు, సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నీటి బోరు మరమ్మతుల విషయంలో ఘర్షణ

విశాలాంధ్ర-ముద్దనూరు: మండలంలోని చిన్నదుద్యాల గ్రామంలో పంచాయతీ నీటి బోరు మరమ్మతుల విషయమై ఘర్షణ పడిన ఘటన మంగళవారం చోటు చేసుకుందని సి.ఐ దస్తగిరి తెలిపారు. సి.ఐ తెలిపిన వివరాల మేరకు గత కొంతకాలంగా గ్రామంలో నీటి బోరు పనిచేయక పోవడంతో గ్రామానికి చెందిన భూమిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి అతని తండ్రి వెంకట్ రెడ్డి ఇద్దరు కలిసి నీటి బోరు మరమ్మతులు చేపిస్తుండగా అదే గ్రామానికి చెందిన సర్పంచు భర్త అయినా బోరెడ్డి మదన్మోహన్ రెడ్డి గ్రామా సర్పంచు మేము అయితే మీరు ఎలా మరమ్మతులు చేస్తారని అడ్డుపడి మాట మాట పెంచుకొని గొడవ పడి మదన్ మోహన్ రెడ్డి అతని చిన్నాయన లక్ష్మీరెడ్డి, ప్రసాద్ రెడ్డి ముగ్గురు కలిసి వెంకటేశ్వర్ రెడ్డి ,శ్రీనివాసుల రెడ్డి,మచ్చు కత్తితో దాడి చేసారు. ఈ దాడిలో వెంకటేశ్వర రెడ్డికి కుడిచేయి బటన్ లేచి గాయం అవ్వగా శ్రీనివాసరెడ్డికి ఎడమ చేయి పైన గాయం అయిందని తెలిపారు. ఈ ఘర్షణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సి.ఐ దస్తగిరి తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

- అధికారులు స్పందించి న్యాయం చేయాలి
- న్యూ మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ బివి షర్మిల

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: సీఎస్ఐ చర్చి వెనుక ఉన్న న్యూ మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ భవనాలను బిషప్, ఆయన కుమారుడు ప్రోక్లెన్లు తెచ్చి కూల్చి వేయించడం అన్యాయమని స్కూల్ కరస్పాండెంట్ బి.వి. షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిషప్ చెప్పినట్లు తాను నడుచుకోలేదని కక్షపూరితంగా స్కూలు భవనాలను కూల్చి వేయించాడని పేర్కొన్నారు. గతంలో ఇలాంటి ప్రయత్నమే చేస్తే తాము పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. తనను పిలిపించి మాట్లాడిన బిషప్ 2025-26 విద్యా విద్యా సంవత్సరం వరకు సమయం ఇస్తున్నామని చెప్పి, రాత్రికి రాత్రి కూల్చివేశారని తెలిపారు. ప్రస్తుతము 250 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తూ ఉన్నారని పేర్కొన్నారు. 30 సంవత్సరాల నుంచి ఇక్కడ స్కూలు ఉందని, తాను ఈ స్కూలును 2020లో తీసుకున్నారని చెప్పారు. అప్పటినుంచి తక్కువ ఫీజులతో స్కూల్ నిర్వహణ కొనసాగిస్తున్నారు తెలిపారు. విద్యార్థుల

కు సంబంధించిన సర్టిఫికెట్స్, మార్కు లిస్టులు, నగదు స్కూలు భవనములో ఉన్నాయని చెప్పారు. భవనాలను కూల్చడంతో అవన్నీ కనిపించకుండా పోయాయని పేర్కొన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్స్ బిషప్, ఆయన కొడుకు ఇస్తారా అని ప్రశ్నించారు. విద్యా సంవత్సరం పూర్తయిన వారు టి సి ల కోసం వస్తూ ఉన్నారని, వారికి ఏమి ఇవ్వలో. తెలియని పరిస్థితి నెలకుని ఉందని చెప్పారు. ఈ ఏడాది విడుదలైన పదవ తరగతి పరీక్షలో 585 మార్కులు సాధించిన విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. జూన్ లో స్కూల్ తెరుస్తారని తెలిపారు. భవనాలు లేకపోతే ఎక్కడ వారిని కూర్చోబెట్టాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరుణ, దయ, ప్రేమ అని బిషప్ చెప్పడమే తప్ప...ఆయన పాటించడం లేదని తెలిపారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు, మత పెద్దలు జోక్యం చేసుకుని పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. పాస్టర్ కె.డి.ఐక్యతరావు మాట్లాడుతూ సి ఎస్ ఐ ఆస్తులపై బిషప్ కు ఎలాంటి అధికారము ఉండదని పేర్కొన్నారు. దక్షిణమండలి చెన్నై వారి ఆధ్వర్యంలో ఆస్తులు ఉంటాయని తెలిపారు. ఇదే బిషప్ సీఎస్ఐ హైస్కూల్లో అక్రమంగా భవనాలు నిర్మిస్తూ ఉంటే కోర్టుకు వెళ్లి ఆపి వేయించామని చెప్పారు. బిషప్ ఇక్కడ వ్యాపారం చేస్తూ ఉన్నాడని విమర్శించారు. సమావేశంలో స్కూల్ డైరెక్టర్లు మనోజ్, ప్రధానోపాధ్యాయుడు ధీరజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయంలో నిత్యం పూజా కార్యక్రమాలు నిర్వహించుకోవాలి

- ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

విశాలాంధ్ర-వీరబల్లి: ప్రతిరోజు ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని రాజంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి అన్నారు మండలంలోని తాటిగుంటపల్లె పంచాయతీలో షికారి పాలెంలో సోమవారం జరిగిన బోనాల పండుగలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసినారు గ్రామంలో ప్రజలు ఆయనకి ఘన స్వాగతం పలికారు అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా అమ్మవారి గుడి నూతనంగా నిర్మించడం జరిగింది. ఈ గుడి కి సంబంధించిన దాత కేకే రెడ్డి సొంత నిధులతో దాదాపు పది లక్షల రూపాయలకు పైగా ఖర్చు చేసి ఆలయం పూర్తి చేయడం జరిగింది గుడి ప్రారంభించి 41 రోజు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు అనంతరం గ్రామస్తులు చెక్కభజనలు వేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్ర నాథ్ రెడ్డి,సర్పంచ్ గోపీనాథ్ రెడ్డి ,పెద్దివీడు సర్పంచ్ నాగిరెడ్డి ,గొల్లపల్లి సర్పంచ్ జయచంద్ర, వైయస్సార్సీపి నాయకులు సంఘం వారి పల్లె నరసింహులు సానిపాయి పంచాయతీ వెంకటరమణ ,స్థానిక వైయస్సార్సీపి నాయకులు గ్రామ భక్తాదులు పాల్గొనడం జరిగింది.

మఠంకు బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు యాత్రికులకు అవస్థలు

- వర్షాలకు ఎండలకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండల కేంద్ర పరిధిలో బస్ షెల్టర్ లేకపోవడంతో స్థానిక ప్రజలు యాత్రికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. బస్‌షెల్టర్ సౌకర్యం లేకపోవ దంతోనే నిత్యం ప్రయాణికులు బస్సు సమ యపాలన లేకపోవడంతో బస్సు కోసం ప్ర యాణికులు ప్రతినిత్యం బ్రహ్మంగారిని దర్శిం చుకునేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుండి భారీగా తరలివస్తుంటారు. అయితే గతంలో ఐదు రోడ్లు కోడలి నందు బస్ షెల్ట ర్ సౌకర్యం కలిగి ఉన్నదని అయితే రోడ్ల విస్తరణలో భాగంగా బస్ షెల్టర్ తొలగిం చడం ఆ స్థానంలో మరో బస్ షెల్టర్ నిర్మా ణం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభు త్వం పక్కనే ఖాళీ స్థలంలో పిల్లర్స్ వేసి నిర్మా ణం చేపట్టడంతో కొంతమంది కోర్టు ఆశ్రయించడంతో బస్‌షెల్టర్ ఆగిపోయింది. అప్పటినుండి బస్‌షెల్టర్ లేక అటు స్థానిక ప్రజలు యాత్రికులకు అవస్థలు తప్పడం లేదు. దూర ప్రాంతాలకు వెళ్లడానికి సెంట్రల్‌లో నిలిచి ఉండడంతో అంగళ్లు యాజమాన్యాలు ప్రయాణికులను యాత్రికులను పక్కకు వెళ్ళండి అని చెప్పడంతో మండు టెండలలో వర్షాలకు అవస్థలు అంతాఇంతా కాదు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు ప్రాంత ప్రజా ప్రతినిధులు దృష్టి పెట్టి తాత్కాలికంగా బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని యాత్రికులు ప్రయాణికులు కోరుతున్నారు. ఇటీవల మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఓ మీడియా సమావేశంలో బ్రహ్మంగారిమఠం అభివృద్ధిలో భాగంగా సమావేశంలో బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తామని త్వరలో పనులను ప్రారంభిస్తామని తెలిపారు. కానీ యాత్రికుల అవస్థలు అంతా ఇంతాకాదు. కనీసం మహిళలకు అక్కడ వాషింగ్ రూములు కూడా లేకపోవడం పక్కనే దేవస్థాన వాషింగ్ రూములు ఉండడంతో వాటికి డబ్బులు రూపంగా చెల్లించి వస్తున్నారని కనీసం వాషింగ్ రూములను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

లీడర్షిప్ ట్రైనింగ్‌పై సిమాట్ ఆధ్వర్యంలో శిక్షణ

విశాలాంధ్ర-సంబేపల్లె: లీడర్షిప్ ట్రైనింగ్‌లో భాగంగా సిమాట్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. అగ్రిపల్లి విజయవాడలో 19వ తేదీ నుండి మే నెల 23వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణా తరగతులకు అన్నమయ్య జిల్లా నుం చి పది మంది ప్రిన్సిపల్స్ ఎంపికయ్యారని తరగతులకు హాజరవుతున్నట్లు తెలిపారు. తరగతులకు హాజరైన ప్రిన్సిపాల్ వారి ప్రాంతాలలోని పాఠశాలలోప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఘనంగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: నందమూరి నటసింహం యంగ్ ఎన్టీఆర్ జూనియర్ నందమూరి తారక రామారావు పుట్టినరోజు సందర్భంగా నంది పల్లె యువత మజ్జిగ పంపిణీ కార్యక్రమం, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా నంది పల్లె పేద వృద్ధులకు అన్నదాన కార్యక్రమం చేపట్టి జూనియర్ ఎన్టీఆర్‌కు ఒక చరిత్ర ఉంది స్వర్గీయ ఎన్టీఆర్ అంశం ఈ తారక రాముడు. నందమూరి వంశంలో నేడు అత్యంత ప్రజాదారణ కలిగిన ఏకైక నటుడు. ఒక రకంగా చెప్పాలంటే నందమూరి అనే బ్రాండ్‌కు తారక్ ఒక ఐకాన్ అని చెప్పవచ్చు చిన్న వయసులోనే బాక్సాఫీస్ వద్ద అనేక రికార్డులను దాటుకుంటూ విరుచుకుపడ్డాడు దానికి కారణం భారీ డైలాగ్స్, కళ్ళు చెదిరే డాన్స్, దుమ్ము రేపే యాక్షన్ సీన్స్, కంటతడి పెట్టించే నటన, ఇలా అన్ని దాంట్లోనూ ఆయన యువతకు అభిమానంగా మారాడు అలాంటి మా అభిమాన నటుడి పుట్టిన రోజు జరుపుకోవడం మాకెంతో ఆనందంగా ఉందని అందుకే పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమాలు, మజ్జిగ పంపిణీ ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున జూనియర్ అభిమానులు పాల్గొన్నారు.

ప్రేమాలయ వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-రామాపురం: వీరబల్లి మండలం వొంగిమల్ల గ్రామానికి చెందిన మాదా పెద్ద రెడ్డప్పరెడ్డి ఆరవ వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె అనితారెడ్డి, అల్లుడు లక్ష్మిశేఖర్ రెడ్డి, మనుమడు యస్వంత్ రెడ్డి రామాపురం మండలం బండపల్లి వద్ద ఉన్న ప్రేమాలయ వృద్ధాశ్రమం లో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతు వృద్దులకు అన్నదానం నిర్వహించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు సందర్భం ఏదయినా కాని వృద్దులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం మేనేజర్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవర రాయి హుండీ ఆదాయం లెక్కింపు

విశాలాంధ్ర-సంబేపల్లె: మండలంలో వెలసిన దేవర రాయిశ్రీ నల్లగంగమ్మ తల్లి హుండీని మంగళవారం లెక్కించినట్లు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ శివయ్య తెలిపారు. హుండీ ఆదాయం 3,23,797 వచ్చినట్లు తెలిపారు. ఆలయ సిబ్బంది పోలీసుల పర్యవేక్షణలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. హుండీ ద్వారా వచ్చిన ఆదాయం మొత్తాన్ని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేస్తున్నట్లు తెలిపారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టండి

- ఆర్టీసీ డిపోను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

విశాలాంధ్ర-రాజంపేట: పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ఉన్నటువంటి ఆర్టీసీ డిపోను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట ప్రధాన బస్టాండ్ నందు పారిశుధ్య నిర్వహణ మౌలిక వసతులు మెరుగుకు వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ప్రధాన బస్టాండు నందలి పరిసరాలు, పారిశుధ్యం నిర్వహణ, బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, పార్సిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. బస్టాండ్‌లో పారిశుద్ధం మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంపై ఆర్టీసీ ఆర్ఎం ను కారణాలు అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌కు ఏఏ ప్రాంతాల బస్సులు వస్తాయి, ప్రయాణికుల ఆక్యుపెన్సి ఎంత తదితర వివరాలను కూడా ఆర్టీసీ ఆర్ఎం, డీఎంలను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ లోపల మరియు పరిసర ప్రాంతాలలో పారిశుద్ధాన్ని పక్కాగా నిర్వహించాలని ఆర్టీసీ ఆర్ఎం మరియు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులును ఆదేశించారు. బస్టాండ్‌లో పారిశుధ్యం, మౌలిక వసతులు మెరుగుపరచడానికి, అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని ఆర్టీసీ ఆర్ఎం ను ఆదేశించారు. అనంతరం రాజంపేట మండలం కూచివారిపల్లె పంచాయతీలోని చెత్త నుండి సంపద సృష్టి తయారీ కేంద్రాన్ని కూడా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ పరిధిలో ఎన్ని హాబిటేషన్స్, ఎన్ని కుటుంబాలు ఉన్నాయి, ఎంతమంది క్లాప్ మిత్రలు ఉన్నారు, రోజువారీ చెత్త సేకరణ చేస్తున్నారా, వారానికి ఎన్ని రోజులు చెత్త సేకరణ కు వెళున్నారు, ఎన్ని వాహనాలు ఉన్నాయి, సేకరించిన చెత్త సెగ్రిగేషన్ చేస్తున్నారా లేదా అని కలెక్టర్ ప్రశ్నించగా... పంచాయతీ పరిధిలో 12 హాబిటేషన్స్, దాదాపు 3800 హౌస్ హోల్డ్స్ ఉన్నాయని, 5 మంది క్లాప్ మిత్రలు రెండు రోజులకు ఒకసారి చెత్త సేకరణ చేస్తున్నట్లు పంచాయతీ సెక్రెటరీ కమలాదేవి కలెక్టర్కు వివరించారు. సేకరించిన చెత్తను ఎక్కడ ఉంచుతున్నారని కలెక్టర్ ప్రశ్నించగా, అక్కడికి కొద్ది దూరంలో ఉన్న డంపింగ్ యార్డ్ లో చెత్తను ఉంచి, అక్కడే సెగ్రిగేషన్ చేసుకొని తీసుకు వస్తున్నట్లు అధికారులు వివరించారు.3800 కుటుంబాలు ఉంటే ఐదు మందితో చెత్త సేకరణ ఎలా సాధ్యమవుతుందని, క్లాప్ మిత్రల సంఖ్యను పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతిరోజు చెత్త సేకరణ చేయాలి. అలాగే తడిపొడి చెత్త ను విడివిడిగా సేకరించాలని, ఈ విషయమై ప్రజలలో అవగాహన పెంచాలని సూచించారు. సేకరించిన చెత్తను తప్పని సరిగా సెగ్రిగేషన్ చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగానే కూచువారిపల్లిలో నివసిస్తున్న కాటుకూటి వెంకట రమణయ్య (70) ఇంటికి వెళ్లి, చెత్త సేకరణ జరుగుతుందా లేదా అని, ప్రతి నెల ఒకటవ తేదీ పింఛను అందుతుందా, ఇంటి వద్దకే వచ్చి పింఛను ఇస్తున్నారా అన్న వివరాలను ఆరా తీశారు. వారానికి 3 రోజులు పాటు చెత్త తీసుకుని వెళ్తున్నారని, పింఛను ప్రతినెల 1వ తేదీన ఇంటికే వచ్చి ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. తడి పొడి చెత్తలను కలపకుండా విడిగా అందజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవి, తహసిల్దార్ పీర్ మున్ని, ఆర్టీసీ ఆర్ఎం రాము, రాజంపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఎంపీడీవో కార్యాలయ ఏవో బాల మునిస్వామి, డిఎల్పిఓ, కూచివారిపల్లి సర్పంచి, వార్డు మెంబర్లు, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన ఏపీడీ

విశాలాంధ్ర-మదనపల్లె: ఉపాధి హామీ పనులను ఏపీడి నంద కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. మండలంలోని కనసాని వారి పల్లి పంచాయతీ దిగవ బోయపల్లి వద్ద కూలీలు ఫీడర్ ఛానల్ పనిని చేస్తున్నారు. ఉపాధిహామీ పనులను పరిశీలనలో భాగంగా మంగళారం ఉదయం ఫీడర్ ఛానల్ పని వద్దకు విచ్చేశారు. అనంతరం ఆయన కూలీలతో మాట్లాడారు. పని విధానంపై పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. రోజువారి కూలీ 307 రూపాయలు వచ్చే విధంగా పనిచేయాలని సూచనలు చేశారు. రైతులు ఉపాది హామీ పథకం ద్వారా పశు గ్రాసం పెంచుకుంటే ఎకరాకు 27,000 ఇవ్వడం జరుగుతుందన్నారు. పెండింగ్ లో ఉన్న బిల్లులు కూడా జమవుతాయని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఏపిడి వెంట ఏపీవో సుబ్రహ్మణ్యం, టి ఏ నాగన్ గౌడ్, క్లస్టర్ టి ఏ బాబాజీ, కురబలకోట మండల సీనియర్ ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్ ఉన్నారు.

పండుగలా మినీ మహానాడు:చల్లా రాజగోపాల్

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నియోజికవర్గ మినీ మహానాడు పండుగలా జరుగుతోందని ఇది ఎంతో సంతోషదాయకం అని తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ అన్నారు. స్థానిక భారత్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మినీ మహానాడు కార్యక్రమానికి చల్లా రాజగోపాల్ యాదవ్ సన్నిహితులు, స్నేహితులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సంధర్భంగా చల్లా రాజగోపాల్ యాదవ్ మాట్లాడుతూ నీతి, నిజాయితీకి నిలువు దట్టం పెద్దాయన నంద్యాల వరదరాజుల రెడ్డి అని, అందుకే ప్రొద్దుటూరు ప్రజలు 6సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. ఈనాడు ప్రొద్దుటూరులో వ్యాపారస్తులు, ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారంటే కారణం అందుకు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి అని గుర్తు చేశారు. ప్రొద్దుటూరు అభివృద్ధికి ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి బాసట వేస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. మనమందరం ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి బాటలో పయనించాలన్నారు.

స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో యువతకు ఉపాధి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ బేపారి జాకీర్ ఆహ్మద్ పేర్కొన్నారు. మినీ మహానాడులో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు తీర్మాణం ప్రవేశపెట్టారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అయితే ప్రత్యక్షంగా 25వేల మందికి, పరోక్షంగా 50వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

విశాలాంధ్ర-కొండాపురం: దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం ఏఐటీయూసీ, సిఐటీయూ, సీపీఐ మరియు వాటి సంబంధ విభాగాలైన ఆటో వర్కర్స్ యూనియన్, అంగన్వాడి, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కార్మికుల శ్రమను దోచి పెడుతూ వారిని కట్టు బానిసలుగా మారుస్తూ తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుండి ఎందరో ప్రాణ త్యాగాల వల్ల సాధించిన కార్మిక చట్టాలను బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చేయడం వల్ల కార్మికులు కట్టు బానిసలుగా మారతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మనోహర్ బాబు, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి పి.వెంకటరమణ, ప్రసాద్, ప్రభుదాస్, తారాదేవి, విజయలక్ష్మి, పద్మావతి, వరలక్ష్మి, శిరీష జ్యోతి పాల్గొన్నారు.

తెలుగు వారి ఔన్నత్యాన్ని చాటిన ఎన్టీఆర్

రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పరిపాలన చేస్తున్న చంద్రబాబు

మినీ మహానాడులో జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసుల రెడ్డి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: తెలుగు వారి ఔన్నత్యాన్ని నలు దిశలా చాటి చెప్పిన స్వర్గీయ నందమూరి తారక రామారావు అని కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక భారత్ ఫంక్షన్ హాలులో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆధ్వర్యంలో మినీ మహానాడు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టీడీపీ జోనల్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, పార్టీ పరిశీలకులు ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించినప్పటి నుండి ప్రతి ఏడాది మహానాడు కార్యక్రమం నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని అన్నారు. ఈ ఏడాది ఈ నెల 27, 28, 29వ తేదీలలో కడప జిల్లాలో మహానాడు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా చూస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. జోనల్ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ ప్రజలే దేవుళ్లు సమాజమే దేవాలయం అన్న నినాదంతో ఆనాడు స్వర్గీయ ఎన్టీ రామారావు పరిపాలన సాగించారని నేడు చంద్రబాబు సారధ్యంలో ప్రజా సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని, రాష్ట్ర ఖజానాను పూర్తిగా ఖాళీ చేశారని మండిపడ్డారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అన్ని విధాలుగా ముందుకు తీసుకువెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. పార్టీ అబ్జర్వర్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు అభివృద్ధి గురించి సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రజలు స్థానిక ఇంతటి అవకాశం ఇచ్చారని, ఏ మిచ్చి మీ రుణం తీర్చుకోగలనని అన్నారు. 6సార్లు ఎమ్మెల్యేగా నన్ను గెలిపించా రన్నారు. ప్రొద్దుటూరు అభివృద్ధే తన ధ్యేయం అని, నిజాయితీ, నిష్పక్ష పాలనను అందించాలన్నదే తన లక్ష్యం అన్నారు. రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రం కోసం అహర్నిషలు పని చేస్తున్నారని మన అందరం ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ప్రొద్దుటూరులో జరిగే అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరం అన్నారు. అలాగే ప్రొద్దుటూరు నుంచి జిల్లాలో జరిగే మహానాడుకు పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు సీఎం సురేష్ నాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీ.ఎస్ ముక్తియార్, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ బేపారి జాకీర్ ఆహ్మద్, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ రాఘవ రెడ్డి, ఆసం రఘురామిరెడ్డి, చల్లా రాజగోపాల్ యాదవ్, సినీహబ్ రాజేశ్వర్ రెడ్డి, వైఎస్ జబీవుల్లా తదితరులు పాల్గొని ప్రసంగించగా పెద్దఎత్తున టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మినీ మహానాడులో తీర్మానాలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మినీ మహానాడులో ప్రొద్దుటూరులో జరగవలసిన అభివృద్ధి ప్రతిపాదనలు బలపరిచి, తీర్మానాలు చేశారు. అందులో 1.టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు కి భారతరత్న ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రతిపా దనను బలపరిచిన మాజీ పట్టణ అధ్యక్షులు ఘంటసాల వెంకటే శ్వర్లు. 2.కుందూ-పెన్నా వరద కాలువ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని, ప్రజలకు నీటి కొరత లేకుండా చేయాలని ప్రతిపాదనను బలపరిచిన మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి. 3.ప్రొద్దుటూరు పరిసర ప్రాంతాలలో మురుగునీరు పారుదల వ్యవస్థ మెరుగుదల కొరకు పనులు చేపట్టాలని ప్రతిపాదనను బలపరిచిన తెదేపా రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి. 4.కడప జిల్లాలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మిస్తే ప్రత్యక్షంగా 10వేల కుటుంబాలకు పరోక్షంగా 20వేల కుటుంబాలకు ఉపాధి కల్పించే ఉక్కు కర్మాగారమును ప్రొద్దుటూరు -జమ్మలమడుగు మధ్య సున్నపురాళ్ల పల్లె గ్రామం వద్ద నిర్మించాలని ప్రతిపాదనను బలపరిచిన పట్టణ అధ్యక్షుడు ఈవి సుధాకర్ రెడ్డి. 5.మహిళల సాధికారతే లక్ష్యంగా ప్రొద్దుటూరులో అపెరల్ యూనిట్ వస్త్ర, దుస్తుల పరిశ్రమను నిర్మించి ఆర్థిక చేయూతను కల్పించాలని ప్రతిపాదనను బలపరిచిన మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.బచ్చల పుల్లయ్య. 6.స్వర్ణ కార్మికుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షనా ఇచ్చి ఎంఎస్ఎంఈ-క్లస్టర్ ఏర్పాటుచేయాలని, కార్మికులకు అవసరమైన పనిముట్లు అందించే విధంగా భవన సముదాయం ఏర్పాటుచేయాలని ప్రతిపాదనను బలపరిచిన తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం సురేష్ నాయుడు, 7.స్పోర్ట్స్ కాంప్లెక్స్-క్రీడా భవనం, ఎన్నికల ప్రచార సంధర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించి క్రీడలను ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు సదరు హామీ మేరకు తక్షణమే క్రీడా భవనాన్ని నిర్మించాలని ప్రతిపాదనను బలపరిచిన మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి. 8.ప్రొద్దుటూరులో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుకు 2024శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రొద్దుటూరులో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారని సదరు హామీ మేరకు ప్రొద్దుటూరులో వైద్య కళాశాల ఏర్పాటుచేయాలని ప్రతిపాదనను బలపరిచిన బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి. 9.నూతన కూరగాయల మార్కెట్ నిర్మించి చిన్నపాటి వ్యాపారస్థులకు చేదోడుగా నిలవాలని ప్రతిపాదనను బలపరిచిన తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్. 10.ప్రొద్దుటూరు నలువైపులా రోడ్ల విస్తరణ ముఖ్యంగా కొర్రపాడు రోడ్డు. మైదుకూరు రోడ్డు, హోమస్ పేట రోడ్డు, శ్రీరాముల పేట రోడ్డు, గంగమ్మ దేవాలయం వీధి రోడ్లను విస్తరణ చేసి అభివృద్ధి చేయాలని ప్రతిపాదనను బలపరిచిన రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు. 11.అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం వారికి చేదోడుగా ఉండేందుకు కార్మిక భవనాన్ని నిర్మించాలని ప్రతిపాదనను బలపరిచిన టీఎన్‌టీయూసీ కడప జిల్లా అధ్యక్షులు కుతుబుద్దీన్. 12.చేనేత కార్మికుల కోసం క్లస్టర్ ఏర్పాటు మరియు జీవనోపాధి కల్పించాలని ప్రతిపాదనను బలపరిచిన బిసి నాయకుడు బొర్రా రామాంజనేయులు. ఈ 12 తీర్మాణాలను ప్రజలు ఏకగ్రీవంగా ఆమోదించారు.

బోర్డు ఏర్పాటు చేయడం హర్షనీయం

సిపిఐ నాయకులు కృష్ణప్ప,సాంబ, మురలి

విశాలాంధ్ర-మదనపల్లె: -మదనపల్లి మండలం బికెపల్లి రెవెన్యూ పంచాయతీలో సర్వేనెంబర్ 552/1 లో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని గుర్తించి,ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేయడాన్ని సిపిఐ నాయకులు స్వాగతించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబ,నియోజకవర్గ కార్యదర్శి మురళి మాట్లాడుతూ మదనపల్లి పరిసర ప్రాంతాల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములు కబ్జాలు జరుగుతున్నాయని అనేకసార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి,జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళినప్పుడు కూడా ఏ ఒక్క అధికారి కూడా స్పందించలేదన్నారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఫైల్ల సంఘటనను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నీరు కార్చేసిందని,దోషులను కాపాడి,బాధితులను కదుపు కొడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు తిరుమల,మాధవ్ పాల్గొన్నారు.

కేకే కొట్టాల గ్రామ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తాం

- టిడిపి నాయకులు బీటెక్ రవి, పార్థసారథి రెడ్డి

విశాలాంధ్ర-వేముల: యురేనియం బాధిత గ్రామాలకు తప్పనిసరిగా కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి బాధిత గ్రామాల పట్ల ఎటువంటి లాపేక్ష లేకుండా పనిచేస్తుందని యురేనియం గ్రామాల్లో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామని బాధిత గ్రామాలకు న్యాయం చేసేందుకు ముందుండి పోరాడుతామని టిడిపి నియోజకవర్గ బీటెక్ రవి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడుపేర్ల పార్థసారథి రెడ్డిలు తెలిపారు. సోమవారం పులివెందుల టిడిపి కార్యాలయంలో యురేనియం టెలింగ్ పాండ్ వల్ల పడుతున్న ఇబ్బందులను టెలింగ్ పాండ్ ఎత్తు పెంచేందుకు యురేనియం అధికారులు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని కేకే కట్టాల,మబ్బు చింతలపల్లి గ్రామాల ప్రజలు పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి తమకు న్యాయం చేయాలని కోరగా ఆయన మంగళవారం అధికారులతో కలిసి టెలింగ్ ఫండ్ ప్రాంతాన్ని పరిశీలిస్తానని హామీ ఇవ్వగా ఆ మేరకు మంగళవారం ఉదయం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పేర్ల పార్థసారథి రెడ్డి, ట్రేడ్ యూనియన్ నాయకుడు శ్రీనాథ్ రెడ్డి,పేర్ల శేషారెడ్డి, తుంగభద్ర హై లెవెల్ కెనాల్ చైర్మన్ జోగిరెడ్డి, ఆర్డీవో చిన్నయ్య తో కలిసి టెలింగ్ పాండ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ నాయకుడు శ్రీనాథ్ రెడ్డి గ్రామస్తులు టెలింగ్ పాండ్ లోపల జరుగుతున్న అక్రమాలను నిర్మాణం లోపాలను బీటెక్ రవికి క్షుణ్ణంగా వివరించగా ఆయన కూడా ఆ టెలింగ్ పాండ్ ప్రాంతాన్ని చూసిన తర్వాత విస్మయం వ్యక్తం చేశారు. టెలింగ్ పాండ్ ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం బీటెక్ రవి,పార్థసారథి రెడ్డిలు మీడియాతో మాట్లాడుతూ యురేనియం అధికారులు నిర్లక్ష్యం కారణంగా కేకే కొట్టాల గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని ఇప్పుడు టెలింగ్ పాండు ఎత్తును మరోసారి పెంచేందుకు ప్రయత్నాలు జరగడం బాధిత గ్రామాల ప్రజలలో భయాందోళన నెలకొని ఉందని బాధిత గ్రామాలకు న్యాయం చేసిన తర్వాతనే ఆ ప్రయత్నాన్ని అధికారులు ముందుకు సాగాలని టెలింగ్ పాండ్ మరో ప్రాంతంలో కూడా నిర్మించేందుకు యురేనియం అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని కానీ కేవలం కేకే కొట్టాల గ్రామం మబ్బు చింతలపల్లి గ్రామానికి మధ్యలో ఉన్న భూములు మాత్రమే తీసుకొని ఎటువంటి ఉద్యోగాలు లేకుండా కేవలం నష్టపరిహారం మాత్రమే చెల్లిస్తామనడం తప్పని బాధిత గ్రామాలలో తీసుకున్న భూముల రైతులకు యురేనియం ప్రాజెక్టులో ఉద్యోగాలు కల్పించి అలాగే కేకే కొట్టల గ్రామాన్ని పూర్తిస్థాయిలో అక్కడి నుంచి తొలగించి మరొక చోట నిర్మించేందుకు చర్యలు చేపట్టిన తర్వాతనే టెలింగ్ పాండ్ ఎత్తును గాని కొత్తది గాని నిర్మించాలని అంతవరకు పాండ్ ను పూర్తిస్థాయిలో ఎటువంటి చర్యలు చేపట్టకూడదని తేల్చి చెప్పారు. యురేనియం అధికారులు ఏదైనా చర్యలు చేపట్టి బాధిత గ్రామాలకు న్యాయం చేయకుండా చేసేందుకు ముందుకు సాగితే ఆ తర్వాత జరిగే పరిణామాలకు అధికారులే పూర్తిస్థాయిలో బాధ్యత వహించాల్సి ఉంటుందని గ్రామాలకు ప్రజలకు న్యాయం చేసేంతవరకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందు సాగుతుందని దానికి గ్రామస్తుల సహకారం కూడా తమకు కావాలని గ్రామస్తులను కోరారు. అనంతరం బాధిత గ్రామాల ప్రజలు కూడా గ్రామంలో జరుగుతున్న టెలింగ్ పాండ్ వల్ల జరుగుతున్న తీవ్ర ఇబ్బందులను బీటెక్ రవి గారి దృష్టికి తీసుకెళ్లగా త్వరలో ఈ ప్రాంతానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను సైతం తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నామని ఆ కార్యక్రమం కూడా త్వరలో జరుగుతుందని బాధిత గ్రామాలకు న్యాయం చేసిన తర్వాతనే టెల్లింగ్ పాండ్ పనులు ప్రారంభిస్తారని అంతవరకు ఆ పనులు అడ్డుకొని తీరుతామని తేల్చి చెప్పారు. టిడిపి నాయకులు టెలింగ్ పాండు సందర్శనకు వస్తున్నారన్న విషయం తెలుసుకున్న పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలోతెలుగు దేశం సీనియర్ నాయకులు పేర్ల శేషా రెడ్డి వేముల మండల తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు బాధిత గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి: జూనియర్ ఎన్టీఆర్ 42వ జన్మదిన వేడుకలు తెలుగు యువత ఆధ్వర్యంలో లక్కిరెడ్డి పల్లెలో ఘనంగా జరిగాయి. తెలుగు యువత మండల అధ్యక్షుడు కొలిమి పకీరయ్య ఎన్టీఆర్ నటన, డాన్స్, చలాకితనం, సేవా కార్యక్రమాలు నమ్మిన అభిమానులని దగ్గర చేర్చుకుని తాతకు తగ్గ మనవడుగా పౌరుషంలో పోటీ లేదు నటనలో ఎదురు లేదు డాన్స్‌లో తిరుగులేదు ఎదురులేని ధీరుడు అయిన నందమూరి తారక రామారావు రూపంతో ఉన్న జన్మదిన శుభాకాంక్షలు ఆయన మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆ భగవంతున్ని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో మెలగాలని వేడుకొనుచున్నాము. ఈ కార్యక్రమంలో మహమ్మద్, అన్వర్, వేల్పుల సిద్దయ్య లాయర్, మద్దిరేవుల ఆంజనేయులు, చంచర్ల రామాంజనేయులు, మసూద్, దిన్నెపాడు సంజీవ రాజు, ఓబులేసు, సి.ఎల్. రాజు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మా కుటుంబాన్ని ఆదుకోండి: మునయ్య ఆవేదన

విశాలాంధ్ర-అట్లూరు: అట్లూరు మండలం కుంభగిరి గ్రామపంచాయతీలోని ఎస్ వెంకటాపురంలో ఉన్న మునయ్య ఇతనికి ముగ్గురు పిల్లలు ఇతను గత ఐదు నెలల నుండి కిడ్నీ వ్యాధి సోకి అనారోగ్య కారణంగా మంచానికే పరిమితమయ్యాడు. అతనికి డాక్టర్లు రెండు కిడ్నీలు పాడయ్యాయని తెలపడంతో, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబ పోషణకు అతడు వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేక చాలా ఇబ్బందులు పడుతున్నాడు. ఆర్థిక సాయం కోసం దాతల సాయాన్ని కోరుతున్నాడు. ప్రభుత్వం సాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, రితీష్ రెడ్డి, సాయం చేయాలని వేడుకుంటున్నాడు. నా బాధను లోకేష్ అన్న చూసి స్పందించి సాయం చేయాలని భార్యాపిల్లలు చేతులు జోడించి వేడుకుంటున్నారు. ప్రభుత్వం దగ్గరి వరకు చేరే దాకా షేర్ చేయాలని కుటుంబ సభ్యులు చేతులు జోడించి వేడుకుంటున్నారు. ఎవరైనా దాతల నుండి ఆర్థిక సాయం కోసం కోరుకుంటున్నాడు. ఫోన్ పే: జి.మునెయ్య: 8978262557, భార్య లక్ష్మీ విజయ, 8179739576.

వైఎస్ఆర్సిపి బలోపేతానికి కృషి చేస్తా: వీరనాగిరెడ్డి

విశాలాంధ్ర-వీరబల్లి: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా నియమితుడైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి గాలివీటి వీరనాగిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డికి, కోడూరు మాజీ శాసనసభ్యులు కొరుముట్ల శ్రీనివాసులు కు, మదనపల్లె ఇన్చార్జ్ అహ్మద్ కు, రాష్ట్ర ఎంపీపీల సంఘం ఉపాధ్యక్షుడు గాలివీటి రాజేందర్ నాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజంపేట లో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డిని, ఎంపీపీల సంఘం ఉపాధ్యక్షుడు గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కి సాయి శక్తుల కృషి చేస్తానని అలాగే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జ్ నరేష్ స్వామి, సర్పంచ్ చిన్న స్వామి, చిన్నగొల్లపల్లి సర్పంచ్ రామా జైచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం

- కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్ ముక్కా రూపానందరెడ్డి

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: చరిత్రలో నిలిచిపోయేలా నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తామని కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి పేర్కొన్నారు.తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు యుగపురుషుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రూపానందరెడ్డి, సతీమణి వరలక్ష్మి, కోటేశ్వరచౌదరి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి మిని మహానాడుకు శ్రీకారం చుట్టారు.జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) ఛైర్మెన్ యర్రగుండ్ల జయప్రకాష్ అధ్యక్షతన రాజ్ కన్వెన్షన్ హాలులో మంగళవారం రూపానందరెడ్డి అధ్వర్యంలో జరిగిన మిని మహానాడు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి అవసరమైన వనరులను సిద్ధం చేసుకొని ప్రణాళికబద్ధంగా ముందుకు పోదామన్నారు.35 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ పాలనలో,5 సంవత్సరాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో జరగని అభివృద్ధి 11 నెలల కాలంలో ఆంధ్రప్రదేశ్ ను ప్రగతి పథంలో నడిపించిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కే దక్కిందన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల, నాయకుల కృషితో తిరుగులేని మెజార్టీ సాధించామన్నారు. తెలుగుదేశంపార్టీ కుటుంబ సభ్యులకు అందరికి అండగా ఉంటామన్నారు. కమతం నాగరాజు మాట్లాడుతూ తెలుగుదేశం అంటే బిసి లు,బిసి లు అంటే తెలుగుదేశం అన్నారు. పంతగాని నరసింహప్రసాద్ మాట్లాడుతూ వైసిపి ఆంధ్రప్రదేశ్ ను దోపిడీ చేసి వ్యవస్థలను భ్రష్టు పట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.చంద్రబాబు వచ్చిన తరువాత అభివృద్ధి పుంజుకుందన్నారు.కెకె మాట్లాడుతూ ఎన్టీఆర్ జన్మదినం పురస్కరించుకుని మిని మహానాడు జరుపుకుంటున్నామన్నారు. కడప నగర శివారు పబ్బాపురంలో జరిగే రాష్ట్ర మహానాడుకు వేలాదిమంది తరలిరావాలని పిలుపునిచ్చారు. కట్టా బాలాజీనాయుడు మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ 1983లో జరిగిన ఎన్నికలలో చరిత్ర సృష్టించారన్నారు. కోడూరు జనార్దన్ నాయుడు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టే సమయంలో ఎన్టీఆర్ జీర్ణించుకోలేక 1982లో తెలుగుదేశం పార్టీ స్థాపించి 1983 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి నామరూపాలు లేకుండా చేశారన్నారు. నాటి నుండి పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి, రైతుల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. గుండాలేటికి, ముస్థేరుకు, గుంజనకు అవసరమైన చోట చెక్ డ్యాం నిర్మించి భూగర్భజలాలు పెంచాలన్నారు. మిని మహానాడు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ముక్కా వరలక్ష్మి తనయులు విశాల్ రెడ్డి, సాయివికాస్ రెడ్డి, సింగమాల రఘునాథరెడ్డి, తనయులు విశ్వనాథ్ రెడ్డి,మహేంధర్ రెడ్డి, మల్లిఖార్జున రెడ్డి, పిఎస్ వేణు,బత్తిన వేణుగోపాల్ రెడ్డి, చరణ్, మురళీధర్ గౌడ్,గజ్జల రమణారెడ్డి, పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్ వెంకటేశ్వరరాజు, అర్బన్ సిఐ కె హెమసుందర్ రావు, రూరల్ సిఐ పసుపుల వెంకటేశ్వర్లు, ఎస్ఐ మహేష్ నాయుడు, గుండాల్ రెడ్డి, రవికుమార్ రాజు, తల్లెం రమణారెడ్డి, కల్లా చలపతి గునిపాటి చెన్నరాయుడు, చంద్రమోహన్, రమేష్ బాబు,యామల సిద్దేశ్వర, మద్దిన గిరినాయుడు,తిరుపతి శేఖర్, సుబ్బరామిరెడ్డి, కట్టా గుండయ్యనాయుడు, ఆకేపాటి సుకుమార్ రెడ్డి, వేమన సుబ్రమణ్యం నాయుడు, కట్టా ఉమాదేవి, గంగరాజు పుష్పలత, సయ్యద్ మెహతాజ్ బేగం, రామరాజు, గుత్తి నరసింహులు, 5మండలాల నుంచి తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు, నాయకులు మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మిని మహానాడుకు విచ్చేసిన తెలుగు తమ్ముళ్లను అదుపు చేయడం సాధ్యం కాలేదు.

సియస్ఐ హాస్టల్ గదుల కూల్చివేతపై వివరణ

విశాలాంధ్ర-కడప: కడప నగరంలోనే సియస్ ఐ ప్రాంగణంలో గల పాత శిధిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేత పై దుష్ప్రచారం చేస్తున్న సందర్భంగా సియస్ఐ రాయలసీమ దయాసిస్ అధికారులు వివరణ ప్రకటన ద్వారా తెలియపరిచారు. కడప నగరంలోని సి.యస్.ఐ. చర్చి ఆవరణములో గల దయాసిస్ బోర్డింగ్ హాస్టల్ గదులు సముదాయం కలదు. ఇవి దాదాపు 100సం. క్రితం నిర్మించారు, పెంకులతో నిర్మించిన ఈ గదులు శిధిలావస్థకు చేరడంతో, ఎవరికైన ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలో భాగంగా కూల్చివేయడం జరిగింది. ఈ గదులల్లో "న్యూ మోడల్ స్కూల్"ను కొనసాగించడానికి 2022 సం వరకు అనుమతిస్తూ అగ్రిమెంటు కలదు. 2022సం.లో కాల పరిధి ముగియడంతో పలుమార్లు ఖాళీ చేయమని చెప్పినప్పటికి ఏవో ఒక కారణాలు, విద్యార్థుల భవిష్యత్తు అంటూ కాలయాపన చేస్తు వచ్చారు. ఇలా రెండు సంగడిచాయి. పాత గదులు కావడం వలన విద్యార్థులకు ఏ క్షణమైన ప్రమాదం జరుగవచ్చు అని "దయాసిస్ అధికారులు" ఈ గదులను కూల్చివేత నిర్ణయం తీసుకున్నారు. స్కూల్ యజమాన్యానికి ఎటువంటి అగ్రిమెంటు గాని, హక్కులు గాని లేవు. అయినా కొందరు దయాసిస్ ప్రతిష్టను భంగం చేస్తూ, దుష్ప్రచారాన్ని చేస్తున్నారు. 100సంవత్సరాల పాత భవనం గనుక, ప్రమాదం జరుగకుండా, అందరి శ్రేయస్సు దృష్ట్యా "దయాసిస్ అధికారులు" ఈ గదులను కూల్చివేస్తుంటే సంబంధం లేని వ్యక్తులు అడ్డు పడ్డారు. అగ్రిమెంటు అయిపోయినా గాని వారు శిథిలావస్థలో ఉన్న గదులలో స్కూల్ పిల్లల అడ్మిషన్లు చేసుకుంటున్నారు. కేవలం ఇవి పాత గదులు, ప్రమాదం జరుగకుండా ఉండాలని ఈ గదులను కూల్చడం జరిగినది అని సియస్ఐ రాయలసీమ దయాసిస్ కడప వారు తెలియజేశారు.